ఆంధ్ర సచిత్ర వారపత్రిక

29-5-81
125 పైసలు



అన్నిటికన్నా తక్కువ ధరకు
అన్నిటికన్నా ఎక్కువ శుభ్రత



ఇతర అన్ని డిటర్జెంట్ బార్‌లకంటే ఎంతో ఎక్కువ ఉత్తమమైనది, ఎంతో ఎక్కువ ఆదానిచ్చేది మరియు సబ్బులకంటే 1½ రెట్లు ఎక్కువ శక్తివంతమైనది.

నీలి రంగు స్వస్తిక్
డిటర్జెంట్ ఉతుకే బార్

ఒక మారు స్వస్తిక్ బార్...మరి ఎప్పటికీ స్వస్తిక్ బార్

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908

శివలెంక శంభు ప్రసాద్
సంపాదకుడు :
[1938 1972]

శుక్రవారం : 29-5-'81
దుర్మతినామ సం. వైశాఖ బ. ఏకాదశి
సంపుటము 74 : సంచిక 37

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*


పోస్టులో ఏడాది చందా రు. 67-60
ఆరు మాసాల చందా రు. 33-80
విడిప్రతి వెల రు. 1-25 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ఎక్కువమందిచే పొగడబడి, ఇప్పటి వరకు 70 లక్షల పాఠకులకు పైగా లాభం పొందిన కోర్సు.

ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడటం నేర్పే సులభమైన, సరళమైన పద్ధతి

"రేపిడెక్స్" ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్సు



Vth Edition

పెద్ద సైజులో
408 పుటలు
వెల : రు. **21-00**
తపాలా ఖర్చులు:
రు. **4-00**

రేపిడెక్స్ పద్ధతి:—

నిత్య వ్యవహారంలో ఉపయోగించే ఆంగ్ల భాష ఎ క్రమబద్ధమైన పద్ధతిలో చదువుతూ నేర్చుకునేందుకు, అర్థం చేసుకునేందుకు ఒక సహజమయిన, సులభమైన పద్ధతి... ఎలాగంటే చిన్నపిల్లలు బడికి వెళ్ళకముందే ఇంట్లోనివారి మాటలు విని సంభాషించటం నేర్చుకున్నట్టు అన్నమాట.

దిగువ పేర్కొన్న యువతీ-యువకులు, స్త్రీ-పురుషుల కోసమై

* అండర్ గ్రాడుయేటయి కూడా ఇంగ్లీషు మాట్లాడటానికి సంకోచించేవారు.
* ఇంటర్వ్యూలో అనుత్తీర్ణులయినవారు, మంచి ఉద్యోగాలు రానివారు.
* కళాశాలలో, సంఘంలో, క్లబ్బులో ఆధునిక యువతీ యువకులతో కలిసి మెలిసి తిరుగలేక పోతున్నవారు.
* బాగా చదువుకున్న పక్కింటి గృహిణులతో, చుట్టాలతో లేదా ఇతర నాగరిక కుటుంబ సభ్యులతో కలిసి మెలిసి తిరుగలేనివారు, ఇంగ్లీషు కాన్వెంటులలో చదివించలేని తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇంటివద్ద చదివించి యోగ్యులుగా చేసేందుకు ఇది అత్యంత సహాయకరమైనది.
* వ్యాపారి లేదా కొట్టు యజమాని ఏ అధికారితోను స్పష్టంగా మాట్లాడలేకపోతే, చదువున్న వ్యక్తికి ఉద్యోగమిచ్చి సరిగా పని చేయించుకోలేకపోయినచో ఇది నిస్సందేహంగా సహాయపడుతుంది.

—అంతే కాదు జీవితంలో ప్రతి మెట్టుకు పునాది
"రేపిడెక్స్ ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్స్"
విజయానికి గ్యారంటీ!

రేపిడెక్స్ కోర్సులోని ప్రత్యేకతలు:—

* సరియైన ఉచ్చారణ కోసమై పాఠాలన్ని ఇంగ్లీషు లోను, మరియు తెలుగు లిపిలో కూడా ఉన్నాయి.
* ఏ భాషనైనా నేర్చుకునేందుకు ఇంతవరకు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనల ఆధారంగా తయారు చేయబడిన మొట్టమొదటి కోర్స్.
* సుమారు 2500 కి పైగా నిత్యం ఉపయోగించే ఇంగ్లీషు పదాలు, మీ ఝంఝాటనను పూర్తిగా పారద్రోలుతాయి.
* సుమారు 4500 కు పైగా చిన్న చిన్న సంభాషణా వాక్యాలు-అంటే,
* ఇంట్లో లేదా కార్యాలయంలో, కళాశాలలో, లేదా క్లబ్బులో, విందులో లేదా సంఘంలో...
* ప్రేయసీ-ప్రియులు, ఆలు-మగలు, అధికారి- గుమస్తా, వ్యాపారి-కొనుగోలుదారు, పెద్ద-చిన్నతో...
* ప్రియ సంభాషణలు, అభివందనము, అభినందనము, ప్రోత్సహించుట, ఓదార్చటంలో...
* మానసికానందం, ఆరోగ్యం, అన్న-పానీయాలు, వేష-భూషణాలు సామాజిక-రాజకీయ ప్రసంగాలు...
* టెలిఫోనులో, ఎదుటి మనిషితో, సభలో లేదా ప్రత్యేక సందర్భంలో...

— అంటే ఏ విషయం గురించయినా... ఏ అంతస్థు స్త్రీ-పురుషులతోనయినా... సరైన పద్ధతిలో నిస్సంకోచంగా ఇంగ్లీషులో మాట్లాడేందుకు అవసరమైన సంభాషణలు.

"రేపిడెక్స్ ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్స్" విజయానికి గ్యారంటీ!

> డబ్బు వాపసు గ్యారంటీ
> మీకు 'రేపిడెక్స్ కోర్సు' సంతృప్తిని కలిగించక పోతే పుస్తకాన్ని తిరిగి పంపండి. తపాలా ఖర్చులు మినహాయించుకొని, మిగిలిన పైకమంతా మీకు పంపిస్తాము.

VANDANA

'రేపిడెక్స్ కోర్స్' అన్ని పుస్తకాల దుకాణాలలోను, బస్సు స్టాండులలోను, రైల్వే స్టేషను మరియు విమానాశ్రయాల్లోని బుక్ స్టాల్సులోను దొరుకుతుంది.

ప్రకాశకులు:
పుస్తక్ మహల్, ఖారీ బావలీ, ఢిల్లీ-6.
PUSTAK MAHAL KHARI BAOLI, DELHI-110006

"RAPIDEX" COURSE available at all leading Bookshops, Roadways Book Stalls, Higgiubothams Railway Bookstalls & their City branches. STOCKISTS–VIJAYAWADA: *A.R. Agancies Main Bazar; * Sri Venkateshwara Book Depot, Eluru Road; * Navodaya Publishers, Eluru Road, * New Students Book Centre, Eluru Road; VISAKHAPATNAM · Gupta Bros Books, Main Road; * Book Centre, Main Road; VIZIANAGARAM: * Students Emporium, Raja Bazar; * Ravva Appala Narsimhula & Sons M.G. Road RAJAHMUNDRY. * The Andhra Book Stall, Main Road; ELURU & GUNTUR. * Lalitha & Co. HYDERABAD: Book Selection Centre, Sultan Bazar * Rajkamal Book Agency Sultan Bazar CHITTOOR : * Padmasri & Co * Madhu Book Stall NELLORE * Sri Srirama Student, Emporium, Trunk Road, CUDDAPAH ; * Andhra Book Stall, MADANAPALLE * Students Emporium.

ఒక అద్భుతమైన తెలుగు వెలుగు ఆరిపోయింది!


అరవై సంవత్సరాల నిర్విరామ సంఘసేవ చేసిన మహనీయురాలు డా. దుర్గాబాయమ్మగారు (72) మే 9న హైదరాబాద్‌లో తనువు చాలించారు— పద్మవిభూషణ్ దుర్గాబాయ్ దేశముఖ్ మహిళా లోకానికి చేసిన సేవలను ప్రపంచంలోని మరే యితర గొప్ప సేవకుల సేవతో పోల్చి చూసినా, అంత కన్నా మిన్నగానే కనపడుతుంది —



15-7-1909 — 9-5-1981

స్వంతంగా చదువుకుని ఎం.ఏ. బి.ఎల్. పట్టాలు, బంగారు పతకాలు, పుచ్చుకున్న ఆమె సుప్రీంకోర్టులోను, మొట్ట మొదటి భారతీయ పార్లమెంటులోను కూడా స్త్రీ జనోద్ధరణ కోసమే కంకణం కట్టుకుని వాదించారు "ఆంధ్ర మహిళా సభ" మద్రాసు హైదరాబాదులు యివాళ దిక్కులేని వైపోయాయి. తెలుగు దేశమేగాదు, దుర్గాబాయమ్మగారిని పోగొట్టుకున్న యావద్భారత దేశమూ ఆమెను బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఎరుగును- ప్రభుత్వం, ప్రజలు ఏకమై జోహార్లర్పించిన యీ 'వీర వనిత' సాధించిన విజయాలు క్లుప్తంగా చెప్పుకున్నా ముందు తరాలు ముక్కున వేలేసుకుని వుండిపోతాయి! మొట్టమొదటిపార్లమెంటుసభ్యురాల ['52] ప్రణాళికా సంఘ సభ్యురాలు ['53]కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ అధ్యక్షత పదవి ('62 దాకా) నిభాయించారు. 53 లో సి. డి. దేశ్‌ముఖ్‌ని వివాహం చేసుకున్నారు. (58-61) మధ్య కాలంలో ఆమె బాలికల మహిళల విద్యాభివృద్ధి జాతీయ సంఘానికి అధ్యక్షురాలు- లాంటి ఎన్నో పదవులలో ఆమె చిత్తశుద్ధితో స్త్రీలోకానికి సేవలుచేశారు- 1963లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆమెకు "డాక్టరేట్" యిచ్చింది. (66-69) మధ్య కాలంలో ఆమె కీర్తి ప్రపంచ మంతటా తెలిసింది! 1976 లో పద్మవిభూషణు లైనారు. గాంధీగారి ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని మూడేళ్ళు జైలుశిక్ష అనుభవించినప్పుడే ఆమె ఇంగ్లీషు భాషని క్షుణ్ణంగా నేర్చుకున్నారు. ఎన్నో గ్రంథాలు రచించిన రచయిత్రి సంగీత ప్రియురాలు— అంతో ఇంతో అన్ని కళల్లోను ప్రవేశమున్న రాజకీయనేత్రి యిన్నిరకాల ప్రజ్ఞలను కనబరచిన దుర్గాబాయమ్మగారి భౌతికకాయం పంచభూతాలలో కలిసిపోయినా, ఆమె నిరుపమాన చరిత్ర మాత్రం ముందు తరాలకొక ఆదర్శ జ్యోతిగా వెలుగుతూనే వుంటుంది. ★ ★ ★

లోకం పోకడ



కారు ప్రమాదంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి రాజారామ్ మృతి



కార్యదక్షుడు, మేటి ప్రజాసేవకుడు రాష్ట్ర ఆర్థిక మంత్రి శ్రీ గెడ్డం రాజారాం (57) హైద్రాబాద్‌కి సమీపంలో మే 10 వుదయం జరిగిన మోటారు కారు ప్రమాదంలో దుర్మరణం పాలైనారు. ప్రభుత్వం ప్రజలు కూడా యీ నాయకుని విషాదాంతానికి దిగ్భ్రాంతి చెందారు. వారం రోజులు సంతాప దినాలుగా పాటిస్తున్నారు. ఈ ప్రమాదంలో మంత్రి అంగరక్షకుడు శ్రీనివాస్ కూడా తన ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంచిక పూర్తి అవుతుండగా తెలిసిందీ విషాద వార్త. శ్రీ రాజారాం లేనిలోటుతీరనిది.


ఇప్పుడు 20 పై. తగ్గింపుతో అందుకోండి
ట్రైలో
అదనంగా నురుగు
అదనంగా శక్తి
అదనంగా పొదుపు
NEW Triple action
Trilo
Extra lather · Extra power · Extra economy
ఇప్పుడే కొని చూడండి—త్రివిధ చర్యగల ట్రైలో ఎంత ఎంతెంత మేలైనదో!
గోద్రెజ్
ఉత్పాదన
CHAITRA-G-144 TEL

సీరియల్

ఇంద్రసింహాసనం

సి. ఆనందారామం

(గత సంచిక తరువాయి)

"నిన్ను ఈ పరిస్థితిలో ఇక్కడ చూడటం ఆశ్చర్యంగావుంది" అన్నాడు యయాతి మాట్లాడలేదు

"ఒకవంక దేశం కల్లోలాలతో ఉడికిపోతుంటే, ఈ అరణ్య ప్రాంతాలలో నువ్వేం చేస్తున్నావయ్యా!"

"దేశం కల్లోలాలతో ఉడికిపోతోందా! ఎక్కడ?"

"నీ వంటి యువకులు కూడా, దేశంలో ఏంజరుగుతోందో తెలుసుకోకుండా, "ప్రేమ, ప్రేమ" అంటూ ఇలా నిర్వీర్యులయిపోవటం బాగుందా? ముందు దేశ క్షేమంగురించి ఆలోచించుకోవాలి! జాతి గౌరవం కాపాడుకోవాలి! ఆ తర్వాతనే ప్రేమలూ, ప్రణయాలూ!"

"ఏంజరుగుతోందో, సెలవియ్యలేదు."

"నైఋతి దిశలో అరాచకం ప్రబలిపోతోంది కిరాతులు బహిరంగంగా గ్రామాల మీద పడి దోచుకొంటున్నారు సామాన్య గృహస్థులకు రక్షణలేదు. స్త్రీల మాన ప్రాణాలకు రక్షణలేదు."

"యయాతి రక్తం పొంగింది. నుదుటి మీద నరాలు అదురుతూండగా "మరి నిర్ఋతి ఏంచేస్తున్నాడు?" అన్నాడు.

"అది నీబోటి యువకులు తేల్చవలసిన విషయం మాబోటి జడదారుల వల్ల కాదు. నీబోటి వీరులను ప్రబోధితులను చెయ్యటం వరకే మా విధి. భారత వీరుడా! నీ ప్రజలను కాపాడుకో!"

తక్షణమే తన అశ్వాన్ని రాజధాని వైపు మళ్ళించాడు యయాతి తగిన బలగాన్ని వెంట తీసుకుని, నైఋతి దిక్కుకు వెళ్ళాడు. యయాతి, సేనలతో వస్తున్నాడనే సమాచారం ఎలా అందిందో, ఆ ప్రాంత మంతా, ఒక్కసారిగా ప్రశాంతత ఆవరించింది.

దాడులూ లేవు, కిరాతులూ లేరు. అన్నిటికంటె యయాతికి పరమాశ్చర్యం కలిగించింది రాజపురుషులే, కిరాతుల దాడు లేవీ లేవని చెప్పటం, నారద ముని నోట అబద్ధం రాదు. రాజపురుషులంతా పోటీలు పడి యయాతికి మర్యాదలు చేసారు. కొందరు మధుర పానీయాలూ, మరికొందరు రకరకాల మాంసాహారాలూ సమకూర్చారు. అక్కడితో ఆగక అతడి విడిదికి అందమైన కన్యలను కూడా పంపారు. మనసు కలుక్కుమంది యయాతికి. ఇక్కడా స్వర్గం ఛాయలేనా? లేక భూలోకంలోని ఈ సుఖలాలసే, స్వర్గంగా రూపువాల్చిందా? కన్యలను తిరస్కరించేసిన యయాతిని వెర్రివాడిని చూసినట్లు చూసారు రాజులు. ఆ రకంగా ఆతిథ్యం మాత్రం అనుభవించి సాధించినదేమీలేక తన నగరానికి తిరిగి వచ్చాడు యయాతి అయితే, ఈసారి తన చారులను పంపాడు అక్కడి పరిస్థితి తెలుసుకోమని. నారదుడి మాటలు అక్షరాల యదార్థమని తెలిసింది దారిదోపిడీలు గృహదహనాలు, మానభంగాలు—ఆ ప్రాంతాల వారందరూ ఇంద్ర పదవిలో వున్న నహుషుణ్ని తిట్టుకొంటున్నారు. అతడి కారణంగానే, ఈ అరాచకత్వమని దూషిస్తున్నారు అప్పుడు యయాతికి తన పొరపాటు అర్థమయింది. తను రాజపురుషులను కలుసుకున్నాడేకాని, ప్రజల మధ్యకు వెళ లేదు. రాజపురుషులు వున్న విషయాన్ని మభ్యపెట్టి ఏమీ లేనట్టు తనకు చూపారు కానీ, కిరాతుల దండయాత్రలు నిజమయితే, ఈ రాజపురుషులు వారిని అణచటానికి తన సహాయం కోరాలి. కాని, ఏమీ లేనట్టు మభ్యపరచవలసిన అవసరం ఏముంది? ఈ రహస్యమేదో తానే తేల్చాలనుకొన్నాడు యయాతి కొంతమంది నమ్మకస్థులైన భటులతో, మారువేషంతో నైఋతి దిశ ప్రాంతాలకు చేరుకొన్నాడు. విన్నదానికంటే, ఊహించిన దానికంటే దారుణంగా వున్నాయి పరిస్థితులు. కిరాతులు విచ్చలవిడిగా ఇళ్ల మీద పడి దోచుకొంటున్నారు. రక్షకభటులెవరూ ప్రజల రక్షణకు రావటంలేదు. ప్రజలే గుంపులుగాచేరి ప్రాణాలకు తెగించి దొంగలను పట్టుకొని రక్షకభటుల కప్పగిస్తే, అతి విచిత్రంగా ఆ దొంగలు బందిఖానాలలోంచి పెళ్ళి కొడుకుల్లాగా బయటికి వచ్చేస్తున్నారు.

జరిగినకథ - 7 : వృషపర్వపురానికి చెందిన రాక్షసరాజు వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ అందం, తెలివితేటలు, ధైర్య సాహసాలు కల రాకుమారి. ఆమె, మానవ రాకుమారుడు యయాతి ఇరువురూ ఒకరినివిడిచి ఒకరు వుండలేనంత గాఢంగా ప్రేమించుకొంటారు. యయాతిని కలుసుకొని తమ నగరంపై దేవతల దండయాత్ర ఆపించమని శర్మిష్ఠను వృషపర్వుడు ఆజ్ఞాపిస్తాడు. తమ అనుబంధానికీ, రాజకీయాలకూ తండ్రి ముడి పెట్టడం ఇష్టంలేకపోయినా యయాతిని కలుసుకోవచ్చుననేభావం ఆమెకు ఆనందం కల్గిస్తుంది. ఇంద్రుడు చేసిన ఘోరాలను సహించలేక సప్తఋషులు అతన్ని పదవీచ్యుతుని గావించి, ఆ స్థానంలో యయాతి తండ్రి నహుషుడ్ని నియమిస్తారు. ఆతన్ని ఏలాగయినా దించేసి మళ్ళీ ఇంద్రుడ్ని ఆ స్థానంలో నిలబెట్టాలని ఇంద్రాణి శచీదేవి ఆలోచిస్తూంటుంది. ఆమెకు నారదుడు సహాయపడతాడు. అతడు నహుషుణ్ని రెచ్చగొట్టి అగ్ని వాయు, వరుణ, నిర్ఋతులలో పరస్పర కలహాలూ, అధికార దాహమూ రగిలేటట్లు ప్రవర్తిస్తాడు. యయాతీ, శర్మిష్ఠలను ఒకటిగా చేస్తుంది ఇంద్రాణి. మహేంద్రుని ఆజ్ఞను ధిక్కరించాడనే నెపంతో జయంతుని యమలోకానికి పంపిస్తాడు నహుషుడు. తనకు అనుకూలుడైన వాడిని యముడి స్థానంలోఉంచి, తన కొడుకును నిర్దోషిగా నిర్ణయించేటట్లు చేస్తాడు నహుషుడు. దీనిని ముల్లోకాల ప్రజలందరూ ప్రతిఘటించడంతో జయంతుణ్నికూడా విడుదలచేయక తప్పలేదు. జయంతుడు భూలోకంలో విమానాల తయారీకి పూనుకొంటాడు శత్రువర్గంతో చేతులు కలిపి, శుక్రాచార్యుల తపస్సు భంగం కాకుండా అడ్డుపడ్డాడని ఇంద్రాణిని సభకు రప్పించి, విచారణ జరిపించి అపకీర్తి పాలవుతాడు నహుషుడు. స్వర్గంలో వుండలేక భూలోకానికి వచ్చేసాడు యయాతి



ఏంచెయ్యాలో తోచని అయోమయ స్థితిలో పడిపోయారు, సాధారణ జనం. మారు వేషంలో వున్న యయాతితో తమ కష్ట సుఖాలు నిర్భయంగా చెప్పేసుకొన్నారు.

"ఇందులో ఏదో తిరకాసుంది. ఈ దొంగలని రక్షకభటులు ఏనాడూ బంధించరు. మేమంతా పట్టుకొని, వాళ్ళకప్పగిస్తే వదిలేస్తున్నారు. ఎవరితో మొరపెట్టుకోవాలో అర్థం కాకుండా పోతోంది. రక్షకభటులకీ, దొంగలకీ లాలూచీ లేమిటో తల పగలకొట్టుకున్నా అర్థం కావటంలేదు."

యయాతి తన భటులతో కార్యరంగంలోకి దూకాడు. ఎప్పటిలా ఇళ్ళమీదపడిన దొంగల గుంపును అతి చాకచక్యంతో బంధించారు యయాతి భటులు.

సాయుధులూ, సుశిక్షితులూ అయిన ఆ భటులముందు దోపిడీ దొంగలు నిలవలేక పోయారు. దొంగలను తీసుకుపోయి రక్షక భటులకప్పగించారు. వాళ్ళు బంధించినట్టు నటించి, ఆ మరునాడే, దొంగలకు పారిపోయే అవకాశం కల్పించారు. యయాతి చారులు దొంగలను తప్పించిన రక్షకభటులను పట్టుకొని యయాతి ముందు నిలిపారు. యయాతి తన మారువేషం తొలగించి యయాతిగా వారి ముందు నిలిచాడు. యయాతిని చూడగానే రక్షకభటులు గడగడ వణికిపోయారు. పాదాలమీద వాలిపోయి "శరణు! శరణు! మహారాజా! శరణు!" అన్నారు, ఒకుమ్మడిగా, దీనస్వరంతో

యయాతి కఠినంగా "ఏమిటిది, మీరు చేస్తున్నది? మీరు రక్షకభటులా? లేక భక్షకులా? దొంగలను మీరే వదిలిపెట్టడానికి కారణమేమిటి? మీ వృత్తి ధర్మాన్ని విస్మరించే నైచ్యానికెందుకు పాల్పడ్డారు?" అన్నాడు.

"మహారాజా! మా రాజ్యాధికారుల ఆనతి అనుసరించే మేము నడుచుకొంటున్నాం — తప్పైనా, ఒప్పైనా, అంతకంటె చేయగలిగిందిలేదు." అన్నారు.

"ఏమిటి? రాజ్యాధికారులే, దొంగలను వదిలెయ్యమన్నారా? ఇది నిజమా?"

"చిత్తం!"

"ఈ విషయం రాజ పురుషుల ముందు రాజ్యాధికారుల ముందూ ఒప్పుకొంటారా?"

రక్షక భటులు ఒకరి ముఖం ఒకరు చూసుకొన్నారు

"చెప్పండి." గద్దించాడు యయాతి.

"చిత్తం— చిత్తం!"

యయాతి వెంటనే రాజ పురుషులనూ, రాజాధికారులనూ సమావేశపరిచాడు. వారి ముందు రక్షక భటులచేత నిజం చెప్పించాడు. మొదట వారంతా అనుకోని ఈ పరిణామానికి బిత్తరపోయారు. కానీ, యయాతి కఠినంగా "మీరు రాజ్యాధికారులేనా? మీ రాజ్యంలో అవినీతి పరులను శిక్షించటానికి బదులుగా విచ్చలవిడిగా వదిలేస్తున్నారా? రక్షక భటుల కర్తవ్యంలో కూడా మీరు జోక్యం కలుగ చేసుకొని, మీరు కోరినట్టు వారు ప్రవర్తించేలా చేస్తున్నారా? ఏమిటీ దారుణం?" అని నిలదీసేసరికి వాళ్ళా విధిలేక నిజంచెప్పేసారు.

"మేము చెయ్యగలిగింది ఏముంది? నైఋతి దిక్పాలకుడు నిర్ృతిగారే, ఈ దాడులు జరిపిస్తున్నారు. ఈ కిరాతులంతా ఆయనబలగమే! వారిని బంధించవద్దని ఆజ్ఞాపించినది కూడా ఆయనే! ఈ విషయం అత్యంత రహస్యంగా ఉంచమన్నారు కానీ ప్రజలను పీడించే రాజకీయ రహస్యాలు ఎక్కువ కాలం దాగవు. మా దిశకు అధిపతి అయిన ఆయన ఆజ్ఞ మేమెలా కాదనగలం?"

నిర్ఘాంతపోయాడు యయాతి. నైఋతి దిక్పాలకుడు— దేవగణాలలో నాథుడు నిర్ృతి స్వయంగా ఇంత అనార్యానికి తలపడ్డాడా? ఎందుకు? నహుషుడు ఇంద్రుడుగా వుంటే, అరాచకం పెరిగిపోతుందనీ, అమానుషచర్యలు మితిమీరిపోతాయనీ, ప్రజలు భావించటానికి ఆ రకంగా నహుషుణ్ని పదవినుంచి దింపితే, తరువాత తాను ఏదో ఒకరకంగా ఇంద్రపదవి కోసం ప్రయత్నించవచ్చని...

కేవలం అధికార దాహంతో ఎంతమంది అమాయకులను పీడించటానికి సిద్ధపడ్డాడు!

నిర్ృతిని శిక్షించే అధికారం నహుషుడిదే! ఆ విచారణ స్వర్గంలోనే జరగాలి! స్వర్గానికి పోవటానికి కానీ, ఇంద్రుడిని కలుసుకోవటానికి కానీ, యయాతికి మనస్కరించలేదు. స్వర్గం పేరు వింటేనే, విరక్తి కలుగుతోంది అతనిలో.

ఏది ఏమయినా, ఎవరోకొందరి స్వార్థం కోసం అమాయకులైన ప్రజలను హింసించవద్దని రాజ్యాధికారులను హెచ్చరించి, నిర్ృతితో తానీ విషయం తెలుసుకొన్నట్టు చెప్పమని ఆదేశించి, రాజధానికి వచ్చేసాడు.

యయాతికి అసలు విషయం తెలిసిందవగానే నిర్ృతి గడగడ లాడిపోయాడు. సాగినంత కాలం రహస్యంగా ఎంతటి నైచ్యానికయినా ఒడిగట్టే అధికారులు తమ రహస్యం బయట పడుతుందనగానే ఒక్కసారిగా నీతిమంతులయి పోతారు. తన కిరాత బలగాని కంతకూ

దాడులు ఆపమని అజ్ఞాపించాడు. ఆ తరువాత నైఋతి దిశలో ఏ దురాగతాలూ జరగలేదు.

17

యయాతి మహావీరుడుగా, మంచి రాజుగా ప్రఖ్యాతి పొందాడు. నహుషుడు ఇంద్రపదవి పొంది స్వర్గంలో ఉండటంవల్ల రాజ్యభార మంతా యయాతి మీదే పడింది. నారదుడి ప్రబోధంతో ప్రేమలోపడి తన కర్తవ్యాన్ని మరిచి, సోమరి ప్రేమ పోషకుడుగా మారక పోయినా, యయాతి శర్మిష్ఠను మరవలేదు. ఏన్ని పనులలో ఉన్నా, వృషపర్వ పుర ప్రాంతారణ్యాలకు వెళ్తూనే ఉన్నాడు. శర్మిష్ఠకు ఏ మాత్రం అవకాశం వున్నా, తనలాగే తనను వెతుక్కొంటూ తప్పకుండా ఆ పరిసరారణ్యాలకు వస్తుందని అతని విశ్వాసం. కానీ, శర్మిష్ఠ అతనికి కనపడడం లేదు. తన చారులను వృషపర్వ నగరానికి పంపాడు. వాళ్ళనువృషపర్వుడు బంధించాడు. శర్మిష్ఠమీది మమకారంతో వృషపర్వుడిమీద దండెత్తలేకపోతున్నాడు యయాతి. ఆ రోజూ అలాగే వేటనెపంతో ఆపరిసరారణ్యాలలోతిరుగుతున్నాడు. ఒక పాడుబడ్డ నూతిలోంచి సన్నని రోదన స్వరం వినిపించింది. వెంటనే ఆ నూతి దగ్గరకు వెళ్ళి తొంగిచూసి వెంటనే ముఖం తిప్పుకున్నాడు. ఆ నూతిలో చెల్లా చెదరుగా పెరిగిన కొన్ని పిచ్చితీగల్ని ఆసుకొని ఏడుస్తోంది, నగ్నంగా ఉన్న దేవయాని. తన పై ఉత్తరీయం నూతిలోకి విసిరాడు. దానిని చుట్టుకొంది దేవయాని. తరువాత తన కుడి చెయ్యి అందించాడు ఆమెకు. ఆ చెయ్యి అందుకొని ఆమెను నూతి నుండి పైకి తీశాడు. ఆమె ఎవరో, ఆ స్థితిలో ఎందుకు ఉందో, తెలుసుకోవాలని కుతూహలం కలిగినా కేవలం తన ఉత్తరీయం చుట్టుకొని వున్న ఆమెతో సంభాషణ జరపటం అమర్యాదగా ఉంటుందని, తలవంచి అభివాదంచేసి, వెను తిరిగి చూడకుండా తన గుఱ్ఱంమీద వెళ్ళి పోయాడు. అలా వెళ్ళిపోతున్న ఆ గంభీర మూర్తిని ఆశ్చర్యంగా చూస్తూ నిలబడింది దేవయాని. ఏదో ఔన్నత్యం కనిపించింది అతనిలో.

యయాతి కొద్దిరోజుల్లోనే తిరిగివచ్చాడు మళ్ళీ ఆ ఉద్యానవన ప్రాంతాలకి. అతని మనసు ఒక్కసారిగా ఆనందంతో ఉగిపిపడింది ఇన్నాళ్ళకు శర్మిష్ఠ కనిపించింది. పరిసరాలలో దేన్నీ చూడకుండా తిన్నగా శర్మిష్ఠను సమీపించబోతున్న యయాతిని "మహారాజా నమస్కారం" అన్న దేవయాని మాటలు ఆపేసాయి. త్రుళ్ళిపడి దేవయానిని చూశాడు. అతని చూపులలో ఆశ్చర్యం గమనించిన దేవయాని చిరునవ్వుతో— చిరు సిగ్గుతో— "నన్ను మరచిపోయారా మహారాజా! ఆనాడు నూతి నుండి..." అంది.

శర్మిష్ఠ ముఖంమీది నుంచి చూపులు కష్టంమీద మళ్ళించుకొంటూ "అవునవును కులాసాగా వున్నారా?" అన్నాడు. అతని మన సంతా శర్మిష్ఠమీద వుంది. శర్మిష్ఠ ఇప్పటిలా ఉల్లాసంగా లేదు. కట్టిన వస్త్రాలు కూడా వెలకలవి కావు. శరీరం మీద అలంకారాలు లేవు. తనను చూడగానే ఒక్కక్షణం ఆ ముఖంలో వికాసం వెల్లివిరిసినా, మరు

ఇంద్ర సింహాసనం

గణం మరింత కళా విహీన మయింది. ఏమిటిది? శర్మిష్ఠ ఎందుకిలా వుంది?

"నా పేరు దేవయాని– శుక్రాచార్యుల కుమార్తెను– వీరంతా నా దాసీలు" అంది, శర్మిష్ఠతో సహా చెలికత్తెల నందరినీ చూపిస్తూ దర్పంతో.

ఉలిక్కిపడ్డాడు యయాతి. శర్మిష్ఠ దేవయానికి దాసిగా మారిందా? ఇదెలా సంభవం? శర్మిష్ఠ యయాతిని దీనంగా చూసింది. ఆ చూపులకు అతని మనసు వికలమయింది శర్మిష్ఠ తన చూపులతోనే దేవయానిని ఏమీ అడగవద్దన్నట్లు అభ్యర్థించింది. ఆ సంకేతం అందుకొన్నాడుయయాతి. గడసరి అయిన దేవయాని ఈ చూపుల భాష అతి తేలిగ్గా అర్థం చేసుకొంది. శర్మిష్ఠ కోరినదేదీ ఆమెకు దక్కటానికి వీల్లేదు. తానే శర్మిష్ఠ కంటే అన్నిటా అధికురాలు! ఇదీ దేవయాని అహం!

"మహారాజా! ఆ నాడు నీ దక్షిణ హస్తంతో నా కుడిచేయి పట్టుకొన్నావు. మనకు పాణిగ్రహణ మయినట్లే! నిన్ను తప్ప నేను మరొకరిని వివాహమాడను."

అదిరిపడ్డాడు యయాతి. ఇవి ఒక స్త్రీ నోటి నుండి వెలువడవలసిన మాటలేనా? అందునా బ్రాహ్మణ కన్య? దేవయాని మాటలకు శర్మిష్ఠ ముఖం కూడా అంతా పాలిపోయింది. నిలవలేనట్లు పక్కనున్న చెలికత్తె చెయ్యి గట్టిగా పట్టుకొంది.

తన మనసులో తలెత్తిన వెగటును బయట పెట్టలేదు యయాతి. ముందు శర్మిష్ఠను దేవయాని దాస్యం నుంచి విడిపించాలి. ఎలా? ఏ అధికారంతో అవని చెయ్యగలడు? దేవయానిని వివాహం చేసుకోవటమే, మేలేమో! అప్పుడు శర్మిష్ఠ కూడా దేవయానితో తన నగరానికి వస్తుంది. ఒకసారి దేవయానిని భార్యగా చేసుకున్నాక, ఆమెపైనా, ఆమె పరిచారికలపైనా, తనకు సర్వాధికారాలూ వచ్చేస్తాయి. "నువ్వు బ్రాహ్మణ కన్యవి. నేను క్షత్రియుణ్ణి. మన మధ్య వివాహ మెలా సాధ్యమవుతుందీ?"

యయాతి మాటలకు చిత్తరపోయి చూసింది శర్మిష్ఠ. ఆ చూపులతోదేవయానికి మరింత ఉత్సాహం వచ్చింది.

"మా తండ్రి ధర్మ విర్ణేత. ఆయనే

ధర్మంగా నిర్ణయించింది అధర్మమెలా అవుతుంది?" అంది దేవయాని దర్పంగా.

ఇదీ దేవయాని అహంకారం! శుక్రాచార్యుల అమోఘ తపశ్శక్తిని అండగా చేసుకొని, ఉచితానుచితాలు పాటించకుండా తన అహంకారాన్ని ప్రదర్శిస్తోందీమె! ఇంద్రియ నిగ్రహంతో కఠోర దీక్షతో తపసు చేసి ఎంతో ఆత్మశక్తి సంపాదించిన శుక్రాచార్యునిలో ఈ పుత్రికా వ్యామోహం ... ఒకప్పుడు జయంతిమీద ప్రేమ! ఆహా! ఈ ప్రేమ ఎంత విచిత్రమైనది! జీవితంలోని కష్టసుఖాలన్నిటికీ ఇదే మూలం! మానవుణ్ణి వున్నతపథాలకు తీసుకుపోవటానికైనా, అథఃపాతాళానికి క్రుంగదీయటానికైనా ఇదేకారణం జీవితంలోని ఏ దశలోనైనా మనిషినివెన్నంటే వుంటుంది ఈ మహత్తర శక్తి!

అద్భుత తపస్సంపన్నుడైన శుక్రాచార్యుడిలో ఈ వ్యామోహమే లేకపోతే, అతడింకా ఎంతటి ఔన్నత్యాన్ని సాధించేవాడో! అసాధారణ ఆత్మశక్తితోపాటు, వెన్నంటి వదలని బలహీనతలు మానవ హృదయాన్ని నిరంతర సంఘర్షణతో నలిపివేయ బట్టే మనిషి ఎప్పటికీ మనిషిగా నే మిగిలిపోతున్నాడు


"శుక్రాచార్యులే వచ్చి ఈ వివాహం ధర్మమని నిర్ణయిస్తే నిన్ను తప్పక వివాహమాడతాను."

పాపం, శర్మిష్ఠ! ఆ లేత ముఖం వింత వడిలిపోయిందేం? ఆ ప్రేమైక హృదయం ఎంత క్షోభించిపోతోంది? సుకుమారమైన ఆ తనూలత ఎంతగా వణికిపోతోంది? "ఇదంతా నీకోసమే. నిన్ను దేవయాని దాస్యం నుంచి విముక్తురాల్ని చేసి నా దాన్నిగా చేసుకోవటం కోసమే" అని శర్మిష్ఠకి చెప్పే వుపాయ మేముందీ ?

"మా తండ్రిని మీ సభకు పంపిస్తాను" అని దేవయాని విలాసంగా తలవంచి నమస్కరించి, నగరానికి బయల్దేరింది.

తల దించుకొని భూమిలోకి పాతుకుపోయినట్టు నిలబడిపోయిన శర్మిష్ఠను చూసి "హూ!" అంది అజ్ఞా పూర్వకంగా. వంచిన తల ఎత్తకుండా, వెనుతిరిగి చూడకుండా యంత్రంలా దేవయానిని అనుసరించింది శర్మిష్ఠ. ఆమె మనసు తనను చూడాలని పరితపిస్తోందని యయాతికీ తెలుసు. అయినా వెను తిరిగి చూడని ఆ

66 రోజుల నిరశన వ్రతం



ఐర్లాండు
బాబీ సాండ్స్ మృతి!

బాబీ సాండ్స్ వయస్సు 28 సం.లు. ఇతను ఐర్లాండు రిపబ్లికన్ ఆర్మీ పార్టీ ఎం. పి; సాయుధ విప్లవ సంఘం నాయకులలో ఒకడు. ఇంగ్లాండులోని బెల్‌ఫాస్ట్ నగరానికి దగ్గరగా 'మేజ్' అనే చోట వున్న జైలులో 66 రోజులు నిరాహారదీక్ష చేసి ప్రాణాలు వదిలిపెట్టాడు. తనకి, తనతోపాటు అరెస్టయి జైల్లో వున్న ఐరిష్ విప్లవకారులకి రాజకీయ ఖైదీల హోదా యివ్వాలని 'సాండ్స్' నిర్విరామంగా ఆందోళన చేశాడు. "ఆహారం, వైద్యం రెండూ–తీసుకోకుండా 66దినాలు గడిపి తన ప్రాణాలు తనే తీసుకున్నాడు" అని ఉత్తర ఇంగ్లాండు అధికార ప్రకటన ఒకటి తెలిపింది!

ఐర్లాండులో గత పన్నెండేండ్లుగా బ్రిటిష్ గవర్నమెంట్ మీద గెరిల్లా పోరాటం సాగుతోంది. గెరిల్లా పోరాటంలోనే శాండ్స్ తన 18వ ఏట అరెస్టు అయి ప్రొటెస్టాంట్ వ్యతిరేక పోరాటంలో ప్రముఖపాత్ర వహిస్తూ పోయిన నెలలో జరిగిన ఎన్నికలలోనే ఎం.పీ గా ఎన్నుకోబడ్డాడు. బాబీ సాండ్స్ నిరశనవ్రతం, మరణం కూడా సభ్య ప్రపంచాన్ని కలవర పెట్టాయి.

అభిమానానికి ఆశ్చర్యపోయాడు. వింతయినా రాచబిడ్డ!

యయాతి తన రాజధానికి వచ్చిన కొద్ది రోజులలోనే శుక్రాచార్యులువచ్చారు,యయాతి సభకి. నిండు సభలో సగౌరవంగా ఆహ్వానించాడు శుక్రాచార్యుణ్ని యయాతి. ఆసభలో మంత్రులూ, సామంతులూ, యోధులేకాక, మునులు కూడా ఉన్నారు. అందరూ తపశ్శక్తి సంపన్నుడైన శుక్రాచార్యుణ్ని గౌరవించారు.

శుక్రాచార్యుడు సభ నొక్కసారి పరిశీలించాడు. అన్ని రాజ సభలలోలాగ ఆ సభలో నాట్యకత్తెలు లేకపోవటం గమనించాడు. అతని మనసు కేదో విచిత్రమైన సంతృప్తి కలిగింది. తన కూతురు తగిన వరుణ్నెంచుకొందని అనుకొన్నాడు.


"ఆచార్యా! నావల్ల కావలసిన పనిఏమైనా వుంటే, సెలవియ్యండి" అన్నాడు యయాతి. అతడు వచ్చిన పని తెలిసీ కూడా ఆ గడుసుతనం అర్థంచేసుకొన్నాడు శుక్రాచార్యుడు యయాతి ఈ నిండు సభలో దేవయానిని అతడిని వివాహమాడటం తన అభీష్టానుసారంగా జరుగుతోందని నిరూపించాలను కొంటున్నాడు. మంచిది! అలాగే జరిగనీ!

"యయాతి మహారాజా! నా కుమార్తె దేవయానికి నీవు తగిన వరుడవని నిర్ణయించాను. ఆమెను వివాహం చేసుకోమని నిన్ను కోరుతున్నాను."

సభ నివ్వెరపోయింది. వర్ణాశ్రమ ధర్మాలు కచ్చితంగా అమలు జరుపు తున్న కాలంలో ఈ వర్ణాంతర వివాహం! సాధారణ పౌరులెవరయినా వర్ణాంతర వివాహానికి సాహసిస్తే వాళ్ళు సంఘ బహిష్కృతులవుతారు. కానీ ఈ దేవయాని యయాతుల వివాహం అత్యంత సహజంగా అందరి ముందూ జరుగుతోంది. ఉన్నత వర్ణాల వారినీ, అండదండలున్నవారిని సంఘం ఏమీ చెయ్యలేదు. విదురు వారే సంఘాన్ని తమతో ఈడ్చుకుపోతారు.

ఇంద్రసింహాసనం

ఏ వుద్దేశంతో యయాతి ఈ వివాహానికి సిద్ధపడ్డాడో, ఆ ఆశ అడి ఆశే అయింది. సాధారణ సమయాల్లోకాని ఆచారాలు వివాహ సమయాల్లో పాటిస్తారు. అందరూ— దేవయానికానీ, ఆమె వెంట శర్మిష్ఠకాని, యయాతి వెంట వివాహం కాగానే రాలేదు. దేవయానినీ, ఆమె పరివారాన్నీ తగిన సారె చీరెలతో వేరుగా పంపారు. వారంతా రాజ కుంటుంబంలో మొగవారి కెవరికీ కనపడ కుండా రాణివాసం చేరుకొన్నారు. దేవయానికీ



ఆమె పరివారానికీ, ప్రత్యేకించి ఒక భవనం ఏర్పాటు చేసారు అంతఃపురంలోనే. దేవయానిని పలకరించడానికన్నట్లు ఆ భవనంలోకి వచ్చిన యయాతి వేయి కళ్ళతో ఆ భవనమంతా వెతికాడు శర్మిష్ఠ కోసం. ఎక్కడా కనపడలేదు.

18

చిత్రకేతుడూ, విచిత్రరథుడూ యిద్దరూ గంధర్వ నాయకులు. ఇంద్ర పదవిలో ఎవరుంటే వాళ్ళని వీరిద్దరూ పందేలు వేసుకుని వందిమాగధుల్లా స్తోత్రాలు చేస్తారు. ఇంద్రుడు పదవిలో వున్నంతవరకు, ఇంద్రుడు చేసిన పనులన్నీ మంచివే అన్నారు. చివరకు అహల్యను మోహించటమూ, మోసగించి అనుభవించటమూ కూడా చాలా గొప్ప పని అన్నారు. ఇంద్రుడు జారిపోయి అజ్ఞాతవాసంలోకి పోగానే నహుషుణ్ని మించినవాడు లేడని బాకాలు ప్రారంభించారు. నహుషుడు ఇంద్రుడుగా ఉండబట్టే, ముల్లోకాలూ చాలా సుఖశాంతులతో వున్నాయన్నారు. భూలోకంలో అంతులేనన్ని గొడవలూ, గందరగోళాలూ జరుగుతున్నాయంటే, అవన్నీ నహుషుడంటే కిట్టనివాళ్ళు కల్పించినవన్నారు. అనవసరంగా పనికట్టుకొని కొందరు ప్రచారం చేస్తున్నారన్నారు. నహుషుడి చుట్టూ తందాన తాన పాడుతూ ఎలాగో స్వర్గంలో కొన్ని కీలక పదవులు సంపాదించుకొన్నారు. ఒకరోజు వారిద్దరూ సమావేశమయి, "అభివృద్ధి పథకాల" ప్రణాళికలు తయారు చేసుకొంటూ వుండగా వారి దగ్గరకువచ్చాడు నారదుడు. అందరిలాగే వారికీ నారదుడంటే భయమూ, గౌరవమూ. ఇద్దరూ పోటీలు పడుతూ నారదుడికి వంగివంగి నమస్కారాలు చేసారు. నారదుడు చిరునవ్వుతో ఆ నమస్కారాలు స్వీకరించి —

"మీరంటే నాకు ప్రత్యేకమైన అభిమానం. నా పట్ల మొదటి నుంచి మీరు భక్తి విశ్వాసాలతో వున్నారు. అందుకే ఈ వార్త మీ చెవిన వేద్దామని వచ్చాను."

"ఏ వార్త ?" మిత్రులిద్దరూ ఏక కంఠంతో అడిగారు.

"మీకు చెప్పాలనే వచ్చాను. కానీ, ఇది మీరు రహస్యంగా ఉంచగలరా ?"

మిత్రులిద్దరూ కుతూహలం పట్టలేక పోతున్నారు.

"ఏ ప్రమాణం కావాలంటే ఆ ప్రమాణం చేస్తాం. చాలా రహస్యంగా ఉంచుతాం."

"కానీ, మీరు నహుషుడి పక్షం వాళ్ళు కదా! ఈ వార్త మీ మనసుకి కష్టం కలిగిస్తుందేమో !"

మిత్రులిద్దరూ ఒకరి ముఖం మరొకరు చూసుకున్నారు. "మేం నహుషుడి పక్షమైనా మాకు లోక కల్యాణం ముఖ్యం. మీరు సందేహించకండి" అన్నాడు చిత్రకేతుడు.

"అవును. మాకు స్వపర భేదాలు లేవు. ఈ విశ్వమంతా మాదే !" వంత పలికాడు విచిత్రరథుడు.

"అయితే వినండి" అని నలువైపులా చూసాడు నారదుడు. ఆరాటం పట్టలేక పోతున్నారు, గంధర్వ మిత్రులు.

"ఎవరూ లేరు చెప్పండి" అన్నారు దగ్గరకు జరుగుతూ. చుట్టూ అద్దాలు తీసిన ఆ గదిలో వారిద్దరి ముఖాలలో ఆత్రుత, ఆరాటం, ఆశ— కుత్సితం- వేయి ముఖాలుగా ప్రతిఫలిస్తోంది ఆ ప్రతిబింబాల మధ్య నారదుడు పరిహాసాన్ని దాచుకోవటానికి ప్రయత్నిస్తూ తనలో తను నవ్వుకొంటున్నాడు. గంధర్వుల సైగ లందుకొని పరివారమంతా దూరంగా పోయారు. "చెప్పండి" అన్నారు మళ్ళీ.

"నహుషుడు త్వరలో పదవి నుంచి దిగిపోతాడు"

అదిరిపడ్డారు ఇద్దరూ. కొంతసేపు ఏమీ మాట్లాడలేక పోయారు.

"మీకెలా తెలుసు ?" సందేహం, ఆ కంఠాలలో. సందేహంతో పాటు కలగాపులగంగా అనేక భావాలు.

"పదవుల కోసం ప్రాకులాటతో పాట్లు చుట్టూ జరుగుతున్నవి గమనిస్తే యింత సందేహించవలసిన అవసరం లేదు. అగ్ని, వాయువులు ఏనాడో నహుషుణ్ని అంగీకరించలేక ఇంద్రాణిని ఆశ్రయించారు. అయితే

ఇంద్రసింహాసనం

ఇంద్రాణితో తమ సంప్రతింపులు రహస్యంగా వుంచుతున్నారు. నిర్ఋతి ఏకంగా తిరుగుబాటు ప్రకటించాలని చూస్తున్నాడు. కుబేరుడు తన డబ్బుతో ఏ ఇంద్రుణ్ణయినా తన గుప్పెట్లో పెట్టుకోగలడని అందరికీ తెలుసు. నహుషుడి విలాసాలూ, అసమర్థతా చూసి, కుబేరుడికి కూడా అతడి పట్ల అయిష్టమే పెరుగుతోంది. సమయానుకూలంగా అటు ఇంద్రాణినీ, ఇటు నహుషుణ్ణి కూడా సమర్థిస్తున్నాడు ప్రస్తుతానికి. కానీ, కొద్ది కాలంలోనే ఇంద్రాణి పక్షం చేరిపోతాడని నాకు తెలుసు. తన పెట్టుబడికి తగిన ప్రతిఫలం లేకుండా కుబేరుడు ఎప్పుడూ ఖర్చు పెట్టడు. ఇక భూలోకంలో నిరుపేదలందరికి అమ్మ ఆరాధ్యదేవత. భూలోకంలో నిరుపేదలే ఎప్పుడూ ఎక్కువ సంఖ్యలో ఉంటారనేది నేను మీకు చెప్పక్కర్లేదు.''

మిత్రులిద్దరూ బెంగగా ఒకరి ముఖం మరొకరు చూసుకున్నారు భయమూ, ఆశా, సందేహమూ, ఒకదానితో ఒకటి పోటీలు పడుతున్నాయి వారి మనసులలో. అంతా గమనిస్తున్న నారదుడు తనలో తను నవ్వుకుంటూ ''కూలిపోతున్న చెట్టును ఆశ్రయిస్తే మనమీదే పడిపోతుంది'' అని వెళ్లిపోయాడు. మిత్రులిద్దరూ ఆలోచనలో పడ్డారు.

''మనం వెంటనే ఇంద్రాణిని ఆశ్రయించటమే మంచిది. నాకూ నహుషుడి బలం తగ్గినట్టే తోస్తోంది'' అన్నాడు చిత్రకేతుడు అప్పటి కప్పుడే తన జండా మార్చేసాడు ఇలా ఎప్పటికప్పుడు తన జండా మార్చెయ్యబట్టే అతడికి చిత్రకేతుడని పేరొచ్చింది.

''అవుననుకో! కానీ, మనం ఇప్పటివరకు ఇంద్రుణ్ణి, ఇంద్రాణినీ, జయంతుణ్ణి దుయ్యబట్టాం కదా! ఇప్పుడు ఇంద్రాణి పక్షం చేరితే ఆవిడ ఏమనుకుంటుంది?'' సందేహించాడు విచిత్రరథుడు, ఇతడు సందర్భాన్ని బట్టి తన రథాన్ని చిత్ర విచిత్రంగా మార్చుకొంటూ తనే పక్షమో ఎవరికీ తెలియకుండా ప్రవర్తించగలడు.

''రాజకీయాలలో ఇలాంటి సందేహాలేవి పనికిరావు. మనం తన పక్షం చేరటమే మహాభాగ్యమనుకొంటుంది ఇంద్రాణి. ఇప్పుడామెకి బలగం కావాలి — వెళ్లి కదిపి చూద్దాం!''

''మిగిలిన అందరూ రహస్యంగా వెళ్లారట! మనమూ రహస్యంగానే వెళ్దాం!''

చిత్రకేతుడూ, విచిత్రరథుడూ ఆరోజే బయలుదేరారు ఇంద్రాణి దగ్గరకి, నారదుడి ద్వారా ''అసలు సంగతి'' విన్నాక వాళ్ళు ఒక్క రోజు కూడా ఆలస్యం చెయ్యదలచుకోలేదు.

ఈ ఇద్దరినీ ఇంద్రాణి సాదరంగానే ఆహ్వానించింది. పొంగిపోయారు. ''ఏం ఇలా వచ్చారు?'' అంది ఇద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకొని ప్రారంభించారు-

''ఆ నహుషుడి వ్యవహారం ఏం బాగుండలేదమ్మా! ఎంతసేపూ విలాసాలూ, వినోదాలూ. తన స్వార్థమే తప్ప విశ్వశ్రేయస్సు ఏనాడూ ఆలోచించడు.''

''ఇంద్రపదవిని ఆక్రమించి ఇన్నిరోజులయింది ఇంద్రుణ్ణి, ఇంద్రకుమారుడు జయంతుణ్ణి తిట్టడంతప్ప అతడు చేసినది ఏమైనా ఉందా?''

(ఇంకా ఉంది)



MCA-SDP-101 TEL

సీరియల్

రాగబంధితాలు

వేమకోటి సీతారామశాస్త్రి

(గత సంచిక తరువాయి)

ఆఫీసులో అందరి సిబ్బంది ముందు సంకెళ్లతో వెడుతున్న శివకుమార్‌ని చూసి ఎంతోమంది సంతోషించారు. రాంబాబే కొంచెం బాధపడ్డాడు.

"ఇలాంటి మనస్సుండబట్టే మిమ్మల్ని అతను అంత నీచంగా ట్రీట్ చేసాడు" అంది నీరజ అతని బాధకు కోపంతో.

"నీకు తెలియదు నీరజా. చిన్నప్పట్నించి కలిసి చదువుకున్నాం. ఏనాటికైనా అతడు బాగు పడతాడని ఆశ వుండేది. కానీ ఈనాడు అది గూడా పోయింది" అన్నాడు కళ్ల నీరు తుడుచుకుంటూ.

"సార్! మిమ్మల్ని చైర్‌మేన్‌గారు పిలుస్తున్నారు" అన్నాడు బంట్రోతు వచ్చి.

"నన్నా!" ఆశ్చర్యపోయాడు రాంబాబు సీటు నుండి లేస్తూ.

లోపలికి వచ్చిన రాంబాబును అందరూ పరిశీలించారు.

"ఈ మీటింగుకు కావల్సిన ఇన్‌ఫర్‌మేషను, కంపెనీ ఎక్కౌంట్సులో లక్షా యాభైవేలు గల్లంతయిన వ్యవహారం మీరే కనుక్కున్నారా" అడిగారు హరిప్రసాద్.

"అవును సార్" అన్నాడు రాంబాబు వినయంగా.

"మీరు బి.కామ్. క్లాసులో పాసయ్యారా ?" తల వూపాడు రాంబాబు.

"మీ నాన్నగారి పేరు ?"

"దశరథరామయ్యగారు."

హరిప్రసాద్ ఆశ్చర్యపోయి అంతలోనే తేరుకుని,

"ఆయనిప్పుడు మీతోనే వుంటున్నారా" అడిగారు.

"అవునండీ" అన్నాడు.

"మిమ్మల్ని ఇవాల్టి నుండి శివకుమార్ స్థానంలో ప్రమోషనిచ్చి, మీ సామర్థ్యం, ఏకాగ్రత వీటన్నిటికిగాను ఆ పోస్ట్‌లో మీ జీతం మరొక వంద రూపాయలకు పెంచాం. ఇవాళే మంచిది. డ్యూటీలో జాయినవ్వండి. కంపెనీని అభివృద్ధిలోకి తీసుకువస్తారని మేం ఆసిస్తున్నాం. విష్ యు బెస్ట్ ఆఫ్ లక్" అంటూ కరచాలనం చేసి ఆర్డర్సు ఇచ్చారు.

రాంబాబుకు ఇది కలా, నిజమా అన్న భ్రాంతి కలిగింది. క్షణంలో తేరుకున్న రాంబాబు మనస్సు ఆనందంతో ప్రఫుల్లమయిపోయింది. కృతజ్ఞతా పూర్వకంగా రంగనాథన్‌గారివైపు చూసాడు. ఇదంతా హరిప్రసాద్‌గారు గమనిస్తున్నారు.

ఆఫీసులో అప్పుడే బంట్రోతు ద్వారా, అందరికీ ప్రాకేసింది రాంబాబు ప్రమోషను వార్త.

రాంబాబు బయటకు రాగానే అందరూ గుమిగూడి అభినందించబోతే —

"ఒక్క నిముషం ఆగండి" అంటూ గుంపు మధ్యనుండి త్రోవచేసుకుని నీరజ వద్దకు వెళ్లాడు. నీరజ ఏదో ఆఫీసు కాగితం చదువుతోంది.

"నీరజా! నాకు ప్రమోషనిచ్చి శివకుమార్ స్థానంలో వేసారు. ఈ శుభవార్త నీతోనే ముందు చెబుదామని వచ్చాను" అన్నాడు.

"కంగ్రాచ్యులేషన్స్" అంది నీరజ ఆనందంగా. తర్వాత స్టాఫంతా అభినందించి, టీ పార్టీ చెయ్యాలని పట్టుబడితే, రాంబాబు జేబులు తడుముకున్నాడు. నీరజే అందరికీ పార్టీ చేసింది. హరిప్రసాద్, డైరెక్టర్లు గూడా అందులో భాగస్వాములయ్యారు.

రాంబాబు శివకుమార్ గదిలో గ్రాడేజ్ రివాల్వింగ్ కుర్చీలో కూర్చునేసరికి సమంగా ఒంటి గంట కొట్టింది. లంచ్‌కు లేచారు హరిప్రసాద్‌గారు, డైరెక్టర్లు.

"భోజనం చేసావా ?" అడిగారు హరిప్రసాద్, లంచ్‌కు బయల్దేరబోతూ నీరజను.

"ఉదయమే చేసానండి" అంది లేచి టైప్ చేసిన కాగితాలు పేడ్‌లో కడుతూ. ఒక్కసారి ఆమె వంక, సీటు వంక చూసి ఆయన వెళ్లిపోయారు.

ఆయన వెళ్లిపోయిన పది నిముషాలకు ఆఫీసు అంతా ఖాళీ అయిపోయింది. రాంబాబు బయటకు వచ్చి "కాఫీకి పోదాం నీరజా" అన్నాడు.

"ఇప్పుడు మీ హోదా పెరిగింది. ఇప్పుడు మాలాంటి వాళ్లతో కలిసి కాఫీకి రాగూడదు. లోపలికి తెప్పించుకోవాలి" అంది నీరజ నవ్వి. రాంబాబు ఆశ్చర్యపోయాడు.

"అదేమిటి నీరజా! బాధ్యతల్నిబట్టి ఉద్యోగాలు ఏర్పడుతాయి. నేను గూడా ఈ కంపెనీలో అందరిలా ఉద్యోగస్థుడ్ని. ఇవాళ ప్రమోషను వచ్చినంత మాత్రాన నా మనస్థితి మారుతుందనుకోవట్టం పొరపాటు" అన్నాడు బాధగా.

రంగనాథన్‌గారు లోపల్నుండి రెండు కాఫీలు పంపించారు. ఆయన సాధారణంగా లంచ్ అవర్‌లో బయటకు వెళ్లరు.

జరిగిన కథ–11 : ఆ ఆఫీస్‌లో కొత్తగా స్టెనో కమ్ క్లర్క్‌గా జాయిన్ అవుతుంది మిస్ నీరజ. మేనేజర్ శివకుమార్ ఆమెపై ఒక ప్రత్యేకమైన అభిమానాన్ని చూపిస్తుంటాడు. అక్కడే గుమాస్తాగిరి చేస్తున్న రాంబాబు దయనీయమైన పరిస్థితిని చూసిన నీరజ అతనికి ఆర్థిక సహాయం చేస్తుంది. ఓనాడు బస్సులో పరిచయమైన లలిత ఇంట్లో ఓ రూములో వుంటుంటుంది నీరజ. నీరజను ప్రేమిస్తున్నాననీ, ఆమె బాధ్యతలను తను స్వీకరిస్తాననీ, పెళ్లి చేసుకుందామనీ శివకుమార్ ఆమెను అడుగగా, నీరజ కొంత టైం కోరుతుంది. జీవితంలో చావుదెబ్బ తిన్న తన స్నేహితురాలు పద్మ గత చరిత్ర గురించి నీరజతో చెప్తుంటుంది లలిత. తన మేనేజర్ సతీష్ పుట్టిన రోజునాడు అతను కోరిన కోర్కె — అతనితో సినిమా ప్రోగ్రాం, ఆ తరువాత అతని ఇంట్లో భోజనం చేయటానికి అంగీకరించుతుంది పద్మ. సతీష్‌ను నమ్మి అతనికి తన సర్వస్వమూ అర్పించుకొంటుంది పద్మ. ఫలితంగా గర్భవతౌతుంది. ఆమెకు తెలియకుండా సతీష్ ఎబార్షన్ చేయిస్తాడు. తరువాత అతని నిజస్వరూపం తెలుసుకొని కుమిలిపోతుంది. సతీష్ ఆమెను ఉద్యోగంలోంచి తీసివేస్తాడు. ఇప్పుడు మరో ఉద్యోగం సంపాదించుకొని గత జీవితాన్ని మరిచిపోవటానికి ప్రయత్నిస్తుంటుంది పద్మ. అజ్ఞాతంగా 'బాబు' అన్న పేరుతో రచనలు చేస్తున్న రాంబాబు తన గత జీవిత చరిత్ర గురించి లలిత, నీరజలకు చెప్తుంటాడు. శివకుమార్ తండ్రి రమణయ్య దశరథరామయ్యగారి కుటుంబాన్ని సర్వనాశనం చేస్తాడు. దశరథరామయ్యగారి సహాయం పొందిన ఒకాయన ఇప్పించిన ఉద్యోగంలో చేర్తాడు రాంబాబు. అక్కడికి శివకుమార్ మేనేజర్‌గా వచ్చి అతనిని నానా హింసలు పెడ్తుంటాడు. రాంబాబు పరిస్థితుల ప్రభావానికి తలవొగ్గి తన కుటుంబాన్ని అలానే నెట్టుకొస్తుంటాడు... రాంబాబు దయనీయమైన గత జీవితాన్ని తెలుసుకొన్న ఆ రోజు చాలా మంచిరోజుగా భావిస్తారు లలిత, నీరజలు. మూడు రోజులు శెలవులు కలసిరాగా లలిత, నీరజ, రాంబాబు ముగ్గురూ కలిసి నీరజ పిన్నిగారి వూరు వెళతారు. ఆ పిన్ని కూతురు శాంతి, కొడుకు సత్యమూర్తి. ఓ పసిపిల్ల ప్రాణం కాపాడబోయి తన కాలు పోగొట్టుకొన్న సత్యమూర్తిని అంతవరకూ గాఢంగా ప్రేమించిన సునంద అతన్ని కాదని తండ్రి కుదిర్చిన సంబంధమే చేసుకొంటుంది. సత్యమూర్తి ఆ జ్ఞాపకాలను మర్చిపోలేక ఆలా పర్ణశాలలో నిర్జీవంగా బ్రతుకుతూంటాడు. తన జీవితంలో ప్రవేశించి, తన జీవితాన్ని కాంతిమయం చేయమని లలితను సత్యమూర్తి ప్రాధేయపూర్వకంగా అడుగుతాడు. ఆమె అంగీకరించుతుంది. లోగడ చెప్పిన పద్మ కథ లలితదేనని తెలుసుకొన్న నీరజ మనసు వేదనకు గురవుతుంది. శెలవులయిపోవడంతో ఆ ముగ్గురు తిరుగుముఖం పడతారు. రాంబాబును వివాహమాడ నిశ్చయించుకొన్నట్లు నీరజ లలితతో చెప్తుంది. శివకుమార్ నీరజను రేప్ చేయబోగా అడ్డుపడి ఆమెను రక్షిస్తాడు రాంబాబు. బొంబాయిలో ఓ స్త్రీని హత్యచేసిన శివకుమార్‌ను అరెస్ట్ చేస్తారు.

రాంబాబు, నీరజను తీసుకుని తన గదిలోకి వెళ్ళాడు.

''మీతో కలిసి నడవడానికి నాకు భయంగా వుంది'' అంది నీరజ అమాయకంగా.

''ఏం !'' అన్నాడు ఆశ్చర్యంగా.

''మీ హోదా పెరిగింది. ఎయిర్ కండీషను ఆఫీసు గది. సుమారు వెయ్యి రూపాయలపైన జీతం, అందులో మంచి రచయితలు. ఎంతోమంది ధనికుల కుటుంబాలు మా పిల్లనిస్తామంటే మా పిల్లనిస్తామంటూ, క్యూలో నిలబడతారు. మీరు గుమస్తా హోదాలో వుండేటప్పుడు మనం ప్రేమించుకున్నాం. ఇవాళ పరిస్థితి వేరుగదా'' అంది భయం నటించి.

''ఎందుకు నీరజా నన్నిలా వేధిస్తావు. నాది ఎలాంటి మనస్సో నీకు తెలుసు. నా యీ ప్రమోషన్ వల్ల నేను మారిపోతానన్న భయం నీకుంటే, మధ్యాహ్నమే నన్ను గుమస్తాగానే వుంచండి సార్ ! నాకీ ప్రమోషను అక్కర్లేదు అని నిజంగానే చెప్పేస్తాను'' అన్నాడు బాధగా. బాధపడుతున్నాడని గ్రహించింది. అతని మనస్సు మారలేదని గ్రహించి నీరజ మనస్సులో ఆనందం వెల్లివెరిసింది.

''ఎందుకయ్యా అక్కర్లేదని ఆయన అడిగితే.''

''కాబోయే మా ఆవిడ నేను మారిపోతానన్న భయంతో వుంది. మా నీరజ ప్రేమకవ్నా నాకింక ప్రపంచంలో ఏమీ అక్కర్లేదు సార్. అంటాను'' అన్నాడు సీరియస్‌గా.

''నిజంగా అలాగ చెప్పగలరు. నేనేదో సరదాగా అంటే అంతకోపం ఎందుకు సార్'' అంది నీరజ, వచ్చే చిరునవ్వును దాచుకుంటూ.

''సరదాకేనా వొక హద్దుండాలి'' కొంచెం కోపంగా అన్నాడు.

''పొరపాటయిపోయింది. క్షమించండి సార్'' అంది చేతులు జోడిస్తూ.

''తప్పుకు శిక్ష పడాల్సిందే.''

''శిక్షించండి సార్ ! అందులో యిప్పుడు మీకు అధికారాలు ఎక్కువయ్యాయి.''

''అయితే కళ్ళు మూసుకో.''

కళ్ళు మూసుకున్న నీరజను కౌగిలిలోకి తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు. నీరజ బుగ్గలు ఎరుపెక్కిపోయాయి. నెమ్మదిగా అతని కౌగిలి విడిపించుకుంటూ, ''బాగుంది యిదా శిక్ష'' అంది.

''ఇప్పటికిదే. తరువాత ఆలోచిస్తాం'' అన్నాడు నవ్వి.

''తప్పుకు ఒకటే శిక్ష. కానీ రెండు శిక్షలుండవు'' అంది గోముగా అతన్ని చూస్తూ.

''ఇవాళ నా మనస్సు ఎంతో హాయిగావుంది నీరజా. వాస్తవానికి ప్రమోషను వచ్చినందుకు కాదు. ఛైర్మన్ హరిప్రసాద్‌గారు నన్ను ప్రశంసించినందుకు. ఇంకో దానికి గూడా నాకు ఆనందంగా వుంది. నా గుమస్తా జీతం మాత్రం వుంచుకుని మిగిలిన డబ్బు, నీ డబ్బులో కొంచెం, మీ తల్లిదండ్రులకు పంపించడంగానీ, వాళ్ళను మన దగ్గరకు తెచ్చుకోవడంగానీ చేద్దాం. ఏమంటావ్'' అన్నాడు, నీరజ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

సాయంకాలం నాలుగంటలకే మీటింగయిపోయింది. కంపెనీ అదనంగా వొకనెల జీతం బోనస్‌గా ప్రకటించింది. హరిప్రసాద్‌గారు వెళ్ళబోతూ నీరజ దగ్గర ఆగి ''కాఫీ అయినా తాగుతావా'' అనడిగారు.

రాంబాబుతో చెప్పి, బుద్ధిమంతురాలిలా ఆయన కారులో ఎక్కి కూర్చుంది.

* * *

సాయంకాలం ఐదు గంటలకే ఇంటికి వచ్చిన రాంబాబు రాకను పసిగట్టి, వొంట్లో బాగోలేక వేగం వచ్చాడేమోననుకుంది.

''నాన్నగారు, అమ్మా ఇద్దరూ వొకసారి దగ్గరగా నిలబడండి'' అన్నాడు తల్లిని వంటింటి నుండి తండ్రికి దగ్గరగా తీసుకువచ్చి.

దశరథరామయ్యగారికి ఏం బోధపడలేదు. రాంబాబు చేతిలో ప్యాకెట్టు ఒకటి వుంది. రాంబాబు తల్లిదండ్రులకిద్దరికీ దండం పెట్టాడు. ఆ ఇంట్లో కుటుంబ సభ్యుల్ని దరిద్ర దేవత కౌగిలించుకున్న



దగ్గర్నుండి, పుట్టినరోజులు లేవు. పండుగలు గూడా ఏదో రివాజు కోసం చేసుకోవటమే. అందువలన రాంబాబు పుట్టినరోజు ఏమి? అని తల్లి ఆలోచిస్తోంది. రాంబాబు తల్లిదండ్రుల చేతిలో స్వీట్సు పెట్టాడు.

"ఇవి తినండి నాన్నగారూ. మీకో మంచి కబురు చెబుతాను" అన్నాడు ఆనందంగా.

"చెప్పు బాబూ. తర్వాత తింటాం" అన్నారు, దశరధరామయ్యగారు.

"తీపి తిన్న తరువాతనే తీపి కబురు చెప్పాలి నాన్నగారూ" అన్నాడు సంరంభంగా. తల్లిదండ్రులు తీపి తింటుంటే చూసి —

"నాన్నగారూ! నాకు ఈరోజు ప్రమోషను ఇచ్చారు. జీతం గూడా ఆ పోస్టులో మరొక వంద రూపాయలు పెంచారు, మా ఛైర్మన్‌గారు" అన్నాడు ఎంతో సంతోషంగా.

ఇద్దరు దంపతుల కండ్లు నిండా ఆనంద బాష్పాలు రాలాయి. దైన్యత, రేపటి రోజుమీద భయం, కుర్రవాడి భావిజీతంమీద ఆలోచన ఇవన్నీ పోయాయి. కనీ పెంచిన తల్లిదండ్రులకు ఎక్కువ సంతోషకరమైన వార్త ఇంకేమిటుంటుంది. భగవంతుడి నుండి అంతకన్నా వాళ్ళ గొప్పవరం ఏమి కోరుకోగలరు. జీవితం అంతకన్నా వారికి గొప్ప బహుమతి ఏమిటివ్వగలదు.

"నువ్వు గూడా స్వీటు తినుబాబూ! నీ జీవితం ఇంత తియ్యగా మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లి శుభప్రదం కావాలని నా ఆశీస్సు" అంది పార్వతమ్మగారు ఎంతో సంతోషంగా. ఆమె ముఖం కాంతి వంతమై పోయింది. గుండ్రని కాసీ అంత కుంకుమ బొట్టులో చెమ్కీ ఇంటి కప్పు కన్నాల గుండా పడిన సూర్యకాంతి కిరణాలతో ప్రభావితమై మెరిసిపోతున్నాయి.

రాంబాబు స్వీటు నోటిలో పెట్టుకున్నాడు.

"మీ ఛైర్మన్ చాలా గొప్పవారులా వున్నారు. ఇన్నాళ్ళ నీవు పడిన కష్టానికి తగిన గుర్తింపు వారి వద్ద నుండి పొందినందుకు నాకు చాలా సంతోషంగా వుంది. వారు గొప్ప అడ్మినిస్ట్రేటరుగా

రాగబంధితులు

కన్పిస్తున్నారు. ఎవరు బాబూ! ఆయన పేరు" అడిగారు దశరధరామయ్యగారు.

"నిజమే నాన్నగారూ! ఆయన గొప్ప మేధావి. పనిలో ఏకాగ్రతను, క్రమశిక్షణను మెచ్చుకునే మహానీయుడు. ఆఫీసులో సిబ్బంది పనిచేసిన తీరు ఆయనకు ఎంతో సంతృప్తికరంగా వుంది. ఒకనెల బోనస్ గూడా ఇచ్చారు. వారిపేరు హరిప్రసాద్ గారండి."

"హరిప్రసాద్‌గారా! ఎవరబ్బా ఈ పేరు ఎక్కడో నేను విన్నట్లుందే ..." అన్నారు సాలోచనగా దశరధరామయ్యగారు.

ఆ ఆలోచన కంతరాయమే కలిగింది.

"నమస్కారమండీ. దశరధరామయ్యగారూ! మీరు వెలిగించిన దీపాన్నండీ. నేనేనండి ఆ హరిప్రసాద్" అన్నారు లోపలికి వస్తూ నమస్కరించి.

ఆయన వెనకాతల రంగనాధన్‌గారు, మరో ఇద్దరు డైరెక్టర్లు. రాంబాబు స్థాణువై పోయాడు. అంతలోనే తేరుకుని, తొందరగా తన గదిలో రెండు కుర్చీలు, రెండు స్టూలు బల్లలూ అర్జంటుగా సర్దితే కూర్చున్నారు. వాకిట్లో ఏమగు లాంటి ఇంపాలా కారు.

"మీరు ... మీరు ... హరిప్రసాద్ ... ఓహో నువ్వటయ్యా బాగున్నావా?" అన్నారు దశరధరామయ్యగారు.

"బాగున్నానండి" అని కాస్సేపాగి —

"ఉదయమే తెలిసిందండి. రాంబాబు మీ అబ్బాయని. కానీ వెంటనే రాలేకపోయినాను డైరెక్టర్ల మీటింగువల్ల. మీరు ఆనాడు వ్యాపారంలో తగిన సలహా ఇచ్చి, ఆదుకోకపోతే ఈనాడు నా బ్రతుకు కుక్కలు చింపిన విస్తరయ్యేది. నామ రూపాలు లేకుండా నాశనమయ్యేవాడిని" అన్నాడు హరిప్రసాద్.

ఎప్పటి మాటో. అది పాతిక సంవత్సరాల సంగతి. అయినా కృతజ్ఞతా, విశ్వాసం, అంతరంతస్థులోనున్న మనిషిచేత పలికిస్తున్నాది. అదే మానవత్వంలో వున్న గొప్పదనం.

దశరధరామయ్యగారి వదనంలో గర్వం తొంగి చూచింది. మునుపటి వ్యాపారంలో పనిచేసినంత ఉత్సాహం వచ్చింది.

"ఆఁ! నాదేముంది లేవయ్యా. నోటిమాట సహాయమేగా. డబ్బు ఇచ్చానా, ధన్యం ఇచ్చానా."

"డబ్బు మాట అలాగుంచండి. ఆ సలహాయే నాకు కోటి రూపాయల మూటలా భావించాను. ఆ తర్వాత విదేశాలువెళ్ళివ్యాపారం చేసాను. కలిసొచ్చింది. తర్వాత దేశం వచ్చి, మీ గురించి వాకబు చేస్తే, ఉద్యోగంలోంచి తీసివేయబడి ఎక్కడికో తరలి వెళ్ళిపోయారని తెలిసింది. మళ్ళా ఆనటికీనాడు మీ దర్శనం చేసుకున్నాను" అంటూ డ్రైవరు తెచ్చి ఇచ్చిన పండ్లబుట్ట ఆయన ప్రక్కన వుంచారు.

"ఇవన్నీ ఎందుకులేవయ్యా! అబ్బాయ్, కాఫీలు తీసుకురా!" అని వంటింట్లోకి కేకవేసాడు.

అప్పటికే సిద్ధమయిన స్వీట్లు, కాఫీలు అవన్నీ ట్రేలో సర్ది తీసుకువచ్చాడు. హరిప్రసాద్, దశరధరామయ్యగార్కి మిగతా డైరెక్టర్లను పరిచయం చేసారు. కాఫీలు త్రాగిన అనంతరం ఒక్కసారి ఇల్లు యెగాదిగా చూసారు. జీర్ణదశలో మరీ కృంగిపోయి వుంది.

"మిమ్మల్ని ఒకటి అభ్యర్థించాలని వచ్చాను" అన్నారు వినయంగా హరిప్రసాద్, ఎన్నో విషయాలు మాట్లాడిన తరువాత.

"చెప్పవయ్యా! నా దగ్గర నీకు మొగమాటం ఏమిటి?"

"ఏమీలేదు. మీ అబ్బాయికి మా అమ్మాయిని ఇవ్వామనుకుంటున్నాను. ఒక్కగానొక్క ఆడపిల్ల తండ్రిగా ఈ కోరిక కోరుతున్నాను" అన్నాడు.

దశరధరామయ్యకు, వంటింట్లో వింటున్న పార్వతమ్మకు నోటమాట రాలేదు. కోటికి పడగలెత్తిన హరిప్రసాదెక్కడ. తనెక్కడ. మాటలు వింటున్న రాంబాబు స్థాణువై పోయాడు.

"ఏంరా అబ్బాయి వింటున్నావా?" అని ప్రశ్నించారు, దశరధరామయ్యగారు. అప్పటికిగానీ చలనం రాలేదు.


"నేను నమ్మలేకుండా వున్నాను. ఇది కలా, నిజమా అన్న భావన కలుగుతోంది. మరొకసారి ఆలోచించి నిర్ణయానికి రావయ్యా ... దేనికయినా సమాన వియ్యం సమాన కయ్యం..." అని అనేసారు.

"అన్నీ ఆలోచించుకునే వచ్చానండీ. మా అమ్మాయి బి. ఏ. చదివి మానేసి, కుట్టు, షార్టుహేండు వ్రాసుపోక నేర్చుకుంది. అమ్మాయి గూడా చాలా బాగుంటుంది. సంగీతం వచ్చు. నేను ఎలాంటి వరుడ్ని తెచ్చినా, మా అమ్మాయి నా మాట కాదనదు. ఇచ్చి పుచ్చుకోవడాల విషయంలో మీకు నేను ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు." అన్నారు.

"మీరు సందేహించక తథాస్తు అనండి సార్" అన్నాడొక డైరక్టరు.

దశరథరామయ్యగారు కొడుకువంక చూసారు సాభిప్రాయంగా.

"మీరు నన్ను క్షమించాలి సార్. మీ అమ్మాయిని నేను చేసుకోలేను" అన్నాడు నెమ్మదిగా రాంబాబు.



జైల్లో పుడితే 'నాన్నా' అని ఎవర్ని పిలవాలి?

ఏకాంత కారాగారవాసంలో బిడ్డ పుడితే ఏం చెయ్యాలి ? — సిసిలీలో మెస్సీనా జైలులో ఒక టెర్రరిస్టు మహిళ చాలా పెద్ద జైలుశిక్ష అనుభవిస్తున్నది. ఆమె యీ మధ్య ఆరుపౌన్లు బరువైన ఒక పాపాయిని కన్నది. ఈ మహిళను వేరే యితరులతో సంబంధంలేని ఒక మూల కొట్టులో వుంచారు. అట్లా వుంటూ వుండి రెండు సంవత్సరాలైంది. మరి ఆమె గర్భవతి ఎట్లా అయిందో ఆ పరమాత్మకే ఎరుక. "ఛస్తే చెప్పనం"దామె.

కాని ఆమె కోర్టు రూంలోనే గర్భవతి అయివుంటుంది అని ఒక టెలివిషన్ విలేఖరి అంటున్నాడు. మిలాన్‌లోని న్యాయస్థానంలోనే— యీమెని ఒక కటకటాల గదిలాంటి దానిలో పెట్టినప్పుడు యీ వ్యవహారం జరిగివుండాలి. చాలా ప్రమాదకరమైన ఖైదీలని యిట్లాంటి కటకటాల గదిలో పెట్టి కోర్టులో విచారిస్తుంటారు.

ఈ అమ్మాయి పేరు ఫ్రాన్సెస్కా బెర్సీరె— ఈమెను యీ పురిటికి 9 మాసాల క్రితం ఒక ట్రక్కులోపెట్టి మిలాన్ నగరం జైలుకు పట్టుకుపోయారట.

అక్కడ కోర్టురూమ్ కటకటాల వెనుక, ఆమె పాత ప్రియుడు యీమెను కలుసుకున్నాడు— కోర్టువారి అనుమతితో వారిద్దరూ కొంతసేపు గడిపారు. 1979 మే నెలలో ఫేబియో బ్రూసా అనే యీ 22 సంవత్సరాల యువకుడి సాంగత్యంలో వుండగానే యీ ఫ్రాన్సెస్కాని పోలీసులు పట్టుకున్నారు. ఈమె వయస్సు 28 సం॥లు.

పైన పేర్కొన్న టెలివిషన్ విలేఖరి మరో 16 మంది ఖైదీలతో కలిపి ఫిలిమ్ తీశాడు యీ జంటతో సహా. ఆ ఫిలిం చూస్తే యీ యిద్దరు వో మూల ఒకర్ని వొకరు పెనవేసుకుపోడం మొదలైన వ్యవహారం కొంతలో కొంత కనపడిందట!

కాని యీ బోనులాంటి గది చుట్టూ వున్న కాపలా పోలీసులెవ్వరూ యీ వైనం గమనించనే లేదు. మిగతా ఖైదీలు కూడా టెర్రరిస్ట్‌లే గనుక, వాళ్ల కేకలు, నినాదాలు వీటితోనే పోలీసులకి సరిపోయినట్లుంది.

మొత్తంమీద జైలులో ఎవరి సంపర్కం సాంగత్యం లేకుండా పుట్టిన యీ బిడ్డ "సిజేరియన్" శస్త్రచికిత్సచేస్తే తప్ప పుట్టలేదు, మెస్సీనాలోని ఒక ఆసుపత్రిలో యీమెకు గవర్నమెంటువారు అన్ని జాగ్రత్తలు తీసుకొని పురుడు పోశారు.

ఫ్రాన్సెస్కాకి యిప్పటికీ 14 సం॥ల శిక్ష బాకీ వుంది. ఈ బాలికకు 3 సం॥ల దాకా తల్లి దగ్గిరే జైలులో వుండనిస్తారు. తర్వాత ఎవరో ఒక దగ్గిర బంధువుకు అప్పగించేస్తారు— దేశద్రోహం, సాయుధ తిరుగుబాటు కుట్ర లాంటి భయంకరమైన కేసులలో శిక్షపడ్డ యీమెని మరోసారి కోర్టువారు గర్భవతి ఎట్లా అయింది ? అన్న అంశంమీద బోనులో పెట్టి విచారించనున్నారు.

[★★★]

రాగబంధితులు

అక్కడున్నవారంతా ఆశ్చర్యపోయారు.

"ఏం. ఎందువలన. మా అమ్మాయి అవిటి దనుకున్నావా ?"

"మీ అమ్మాయి అందం గురించి నే నాలోచించటంలేదు. అవిటిదయినా మీ ఆజ్ఞ శిరసావహించే వాణ్నే. కానీ... కానీ" ఆగాడు చెప్పలేక.

"నా ఆస్తి మొత్తం పెళ్లికి ముందుగానే నీ పేర రిజిస్ట్రేషన్ చేస్తాను." అన్నారు హరిప్రసాద్ దృఢంగా.

"మీ ఆస్తి కోసం కూడా కాదు. నాకు ఇతరుల ఆస్తి మీద ఆశ లేదు. మీ రివ్వబోయే కట్నాలు, కానుకలుమీద అంతకన్నా ఆసక్తిలేదు. నా దృష్టిలో ఆడపిల్లల తండ్రుల్ని పీడించి కానీ, ఆడపిల్లల కట్నాల కాసించిగానీ పెండ్లి చేసుకునేవాడు పరమ నీచుడు. ఈనాటి యువకులు స్వశక్తిమీద ఆధారపడి, తన జీవితం రంగుల వర్ణ చిత్రాన్ని తనే స్వయంగా చిత్రించుకోవాలి. దరిద్రంలో వున్నా, ధనంలో వున్నా వ్యక్తిత్వం గల మనిషిగా ప్రకాశించాలి."

"ఇలాంటివి కథల్లోనే సాధ్యమవుతాయి. దైనందిన జీవితంలో చాలా అరుదు" అన్నారు, రంగనాథన్ అంగీకరించమని సౌంజ్ఞ చేస్తూ.

"మరి ఇన్నీ ఆశయాలు వల్లిస్తున్నావు. నా మాట మన్నిస్తానంటూనే తిరిగి తిరస్కరిస్తున్నావు. అసలు పెండ్లి చేసుకోననటానికి కారణం చెప్పలేదు" అన్నాడు హరిప్రసాద్.

"కారణం ప్రత్యేకించి ఏమీలేదు ... కానీ ... నేనొక అమ్మాయిని ప్రేమించాను. మేం ఇద్దరం పెండ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నాం ..." అన్నాడు నెమ్మదిగా.

దశరథరామయ్యగారూ, పార్వతమ్మగారు గ్రహించారు ఆ అమ్మాయి ఎవరో.

"ఆ అమ్మాయి, మా అమ్మాయి కన్నా అందగత్తె, ఆస్తిపరురాలా" అడిగారు గంభీరంగా హరిప్రసాద్.

"ఆ అమ్మాయికి ఏమీలేదు. చాలా సామాన్యమైన మాలాగే దిగువ మాధ్యమిక కుటుంబానికి చెందినది. అసలు ఈ పాటికే పెళ్లిఅయిపోవాల్సింది. కానీ ఆ అమ్మాయి తాలూకు తల్లిదండ్రులు వచ్చి, సాంప్రదాయంగా మా నాన్నగార్ని అమ్మగార్ని తొందరలో కలుస్తారని చెప్పింది. అందువలన ఆగిపోయింది" అన్నాడు కొంచెం నిదానంగా.

రాంబాబు హరిప్రసాద్‌గారి వద్ద భయభక్తులుండడం వల్ల సమంగా మాట్లాడలేక పోతున్నాడు.

హరిప్రసాద్ నిట్టూర్చారు.

"పోనీ బాబూ! ఆ అమ్మాయి చాలా అదృష్టవంతురాలు. ఎవరమ్మాయి. ఇక్కడే వుంటున్నదా? ఆమె పేరు" అడిగారు హరిప్రసాద్.

"ఆ అమ్మాయి పేరు నీరజ. మన ఆఫీసులోనే పనిచేస్తున్నదండీ" అన్నాడు రాంబాబు తలవంచుకుని.

"ఇప్పుడొక హోదాలోకి వచ్చావు. పొట్టకూటికై ఉద్యోగం చేస్తున్న అమ్మాయిని పెండాడ్లి, నీ భవిష్యత్తు నాశనం చేసుకుంటావా ?" అన్నారు కొంచం కోపంగా.

"నన్ను క్షమించండి. మీరిచ్చిన ప్రమోషను గూడా కావాలంటే నేను వదులుకుంటాను. గుమస్తాగానే బ్రతుకుతాను. కానీ నీరజను మాత్రం పెండ్లి చేసుకోకుండా ఉండను" అన్నాడు రాంబాబు దృఢంగా.

"మరొకసారి ఆలోచించు రాంబాబూ" అని హెచ్చరించారు, యింకో డైరక్టరు.

"మిమ్మల్నందర్నీ ఈ విషయంలో కించ కలిగించినందుకు నన్ను మన్నించాలి" అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

రెండు క్షణాలు నిశ్శబ్దమైపోయింది.

"ఆల్ రైట్ రాంబాబూ! నీరజ గూడా మా ఆఫీసులో అమ్మాయే కాబట్టి, ఆమె తరుపున మేమే నిశ్చితార్థం, ముహూర్త నిర్ణయం చేసి, పెండ్లికి కావల్సిన యేర్పాట్లు చేస్తాం. మన కంపెనీలో యిదొక కొత్త పద్ధతి అవలంబిద్దాం. యేమంటారు" అన్నార హరిప్రసాద్‌గారు. ముగ్గురూ తల వూపారు.

"అయితే రేపే నిశ్చితార్థం. రోజు కూడా బాగుంది. సాధారణంగా వధువు యింటిదగ్గర కదా జరగాలి. అంచేత కంపెనీ గెస్ట్‌హౌస్‌లోనే ఈ నిశ్చితార్థం జరుగుతుంది. మీ దంపతులు అబ్బాయిని తోడ్కొని రండి. కారు పంపిస్తాను. నాకు శలవిప్పించండి. నమస్కారం" అంటూ లేచారు.

"కానీ నీరజ వొప్పుకుంటుందో, లేదో" అన్నాడు రాంబాబు సందేహంగా.

"నేను నీరజకు కావల్సిన వాళ్లందర్నీ రప్పిస్తాను లేవయ్యా. వాళ్లందరి అంగీకారంతో ఈ పెళ్లి జరిపిస్తాను" అంటూ బయటకు వచ్చారు.

కారు వరకు వచ్చిన రాంబాబు భుజం తట్టి రంగనాథన్ కారు యెక్కారు. కారు కదిలింది.

(ఇంకా వుంది)


ఇదుగో...
వజ్రంలాంటి అంచుగల
వాడైన బ్లేడు
Erasmic
Supreme
Erasmic
STAINLESS
Supreme
అత్యుత్తమమైన స్టెయిన్‌లెస్ స్టీల్ తీసుకున్నాం...దాన్ని పదును పెట్టాం, ఆరగదీశాం, సానపట్టాం, మెరుగు పెట్టాం—అయినా మాకు తృప్తి కలిగిందా అంటే లేదు. అందుకే, అంచుమీద వాక్యూమ్ స్థితిలో అతిసూక్ష్మ లోహ రేణువులను శక్తివంతంగా స్ప్రే చేశాం, టెఫ్లాన్ పూత వేశాం; ఆ విధంగా ఓ రత్నాన్నే సృష్టించాం—'వజ్రం లాంటి అంచుగల' వాడైన బ్లేడు.
కొత్త ఇరాస్మిక్ స్టెయిన్‌లెస్ సుప్రీమ్– మీ ముఖానికి అర్హమైంది ఇదే!
ఇరాస్మిక్
స్టెయిన్‌లెస్
సుప్రీమ్
సాంకేతిక ప్రావీణ్యం మరి ఇరాస్మిక్, సుఖమైన షేవ్ ఇది సుప్రీమ్!
లింటాస్–SHP. ESP. 4-2315

నేనెవరికోసం బ్రతకాలి?

ముమ్మిడి శ్యామలారాణి



"మురళీ ... మురళీ" అని తలుపు దబదబా కొట్టసాగాడు శేఖర్.

"వస్తున్నా ..." అని తలుపు తీసిన ఇందిర రెండు అడుగులు వెనక్కివేసి, "అన్నయ్య లేడండి" అంది.

"మురళీ లేడాండీ, ఐదు గంటలకు వస్తాను అని చెప్పానే, ఎక్కడికి వెళ్ళాడో మీతో చెప్పాడా ?" అని లోపలికి అడుగుపెట్టాడు శేఖర్.

లోపలికి వస్తున్న శేఖర్‌వైపు బెదురుగా చూస్తూ "నాతో ఏమీ చెప్పలేదండి, అరగంట క్రితం ఎవరో మోటారుసైకిల్‌మీద వచ్చారు. ఇద్దరు కలిసి వెళ్ళారు" అంది.

"ఓహో! వాడా! ప్రసాద్‌తో వెళ్ళాడు. కొంచెంసేపు వెయిట్ చేస్తాను, వస్తాడేమో" అన్నాడు.

"అ ... కూర్చోండి. ఇంట్లో ఎవరులేరు. అమ్మ, నాన్నగారు గుడికి వెళ్ళారు" అని అంది ఇందిర, కొంచెం కంగారు మిళితమైన స్వరంతో.

ఇందిర కంగారు చూస్తున్న శేఖర్ పెదాలపై నవ్వు బయలుదేరింది. "మీరు అలా ఎందుకు కంగారు పడుతున్నారో అర్థం కావడంలేదు. అఫ్‌కోర్సు నేను వెయిట్ చేయడం మీకేమైన అభ్యంతరం అయితే వెళ్ళిపోతాను చెప్పండి" అన్నాడు శేఖర్.

"అబ్బే ... అదేం కాదండి. మీరు ... మీరు కూర్చోండి. కాఫీ తీసుకువస్తాను" అని లోపలికి వెళ్ళింది ఇందిర.

ఇందిర కంగారు, తననుండి తప్పించుకోవడానికి కాఫీ తెస్తాను అని వెళ్ళిపోవడం నవ్వు తెప్పించాయి శేఖర్‌కి. అందమైన పాలరాతి బొమ్మలా, తాకితే కందిపోయేలా ఉన్న గులాబి పువ్వులాంటి శరీరంతో ఉన్న ఇందిరను చూస్తుంటే ఈ రోజే కాదు రెండేళ్ళుగా అంటే ట్రాన్స్‌ఫర్ అయి వచ్చి విశాఖపట్నంలో మురళీ మెడికల్ కాలేజిలో జాయిన్ అయినప్పటినుండి ఇందిరను చూస్తుంటే మనసులో ఏదో తీయని కోరికలు బయలుదేరుతున్నాయ్! ఇందిర తన స్వంతమైతే అంతకన్నా జీవితంలో తనకి కావలిసినదేముంది? కాని... చూస్తూ ఏ అమ్మాయి అందులో అందమైన అమ్మాయి తనని వివాహం చేసుకోవడానికి అంగీకరిస్తుంది? అన్నీ ఇచ్చి భగవంతుడు తననుండి అందానిని ఎందుకు దూరం చేసాడో! జీవితంలో మొదటిసారిగా తను దెబ్బతిన్నాడు. ఎంత మరచిపోదామన్న ఆ సంఘటన ఇప్పటికి మరచిపోలేకపోతున్నాడు.

* * *

మెడిసన్ నాలుగవ సంవత్సరం చదువుతున్న రోజులు. మెడికల్ కాలేజి బ్యూటి అయిన లత అందం తనని పిచ్చివాడిని చేసింది. 'లతని తను వివాహం చేసుకుంటే' అన్న కోరిక తనలో బయలుదేరింది. లత అందం అలాంటిది. అందుకే ఆ రోజు తన మనసులో కోరిక లతతో చెప్పాలని నిర్ణయానికి వచ్చాడు.

"ఏమండీ! మీతో ఒకసారి మాట్లాడాలి. మీకేమైన అభ్యంతరమా" అన్నాడు.

ఒక్క నిముషం కళ్ళెత్తి శేఖర్ ముఖంలోకి చూసిన లత "వ్వాట్! నాతో మాట్లాడతారా? మాట్లాడడానికి మీకు నాకు ఏమున్నాయ్! అయినా ఏదో మాట్లాడాలి అంటున్నారు. కాబట్టి చెప్పండి? క్విక్! అవతల నాకోసం ఫ్రెండ్స్ వెయిట్ చేస్తున్నారు" అంది లత.

చెప్పాలి అనుకున్నది చెప్పడానికి కొంచెం భయపడ్డాడు శేఖర్, కాని చెప్పక తప్పదు. లత తన


మంగళకరమైన వెన్నెల మోమును
మెరుగు పరచటానికి
ఐటెక్స్
మాట్ ఫినిష్ తిలకం
దేశమంతటా నాగరిక యువతులు కోరి ధరించేది ఐటెక్స్
తిలకం నారీమణుల పుష్ప విధానాన్ని అద్భుత సౌందర్యాన్ని
ప్రస్ఫుటం చేసేటందుకే కమ్మలకించిన 14 రంగులలో
దొరుకుచున్నవి. శాస్త్రీయ విధానంలో తయారుచేయబడు
ఐటెక్స్ తిలకం చర్మానికి ఎటువంటి హానియు కలుగజేయదు
EYETEX
ఐటెక్స్
38 సంవత్సరములుగ మీ నమ్మకానికి
పాత్రమైన, ఉన్నతమైన చిహ్నం.
అరవింద్ లాబొరేటరీస్ మద్రాసు 600033

అర్ధాంగి అయితే అంతకన్నా కావలసినదేముంది ?

"అరె... వ్వాట్ శేఖర్ ! ఏదో మాట్లాడాలి అని ఆలోచనల్లో పడ్డారు" అని గలగలా నవ్వింది.

ఆ నవ్వుకి పారవశ్యం అయిపోయాడు శేఖర్. "నా మనసులో మాట చెబుతున్నాను. మీరు నన్ను అపార్థం చేసుకోకండి. ఐ లౌ యూ" అన్నాడు.

ఎర్రబారిన కళ్ళతో తీక్షణంగా శేఖర్ వైపు చూసి "వ్వాట్... నువ్వు అంటున్నది ఏమిటి" అంది.

"అవును లతా. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. మీకభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని వివాహం చేసుకుంటాను."

"వ్వాట్ మిస్టర్ ! నువ్వు ... నన్ను ప్రేమించడమా ? బట్ నేను నిన్ను ప్రేమించడం లేదే ! కాని ఒకమాట. నువ్వు చాలా పేరాశకు పోయావ్ ! ఐ మీన్ నిజం చెప్పాలంటే నేనే కాదు. ఏ అమ్మాయి అందులో, నాలాంటి బ్యూటీ గరల్ చూస్తూ ... చూస్తూ నిన్ను వివాహం చేసుకోవడానికి అంగీకరించదు. నాకు లక్షలు ఆస్తి ఉండవచ్చు, ఫారిన్ కారు ఉండవచ్చు. కాని ... అవన్నీ ఏ స్త్రీ కోరదు. ఒకవేళ ఏ అమ్మాయి అయినా నిన్ను పెళ్ళి చేసుకుందే అనుకో ! నిన్ను చూసి మాత్రం కాదు ... నీ ఆస్తి ... నీ కారు ... వగైరా ... వగైరా ... బై" అంటూ చరచరా వెళ్ళిపోయింది అక్కడనుండి లత.

* * *

"ఏమండీ ! ... సారీ ... ఏమీ అనుకోకండి. ఇంట్లో ఎవరు లేరన్న అభిప్రాయంతో అలా అన్నందుకు మీరు బాధపడుతున్నట్లున్నారు. క్షమించండి" అని కాఫీ కప్పు టీపాయ్‌మీద పెట్టింది ఇందిర.

శేఖర్ ఆలోచనల నుండి తేరుకున్నాడు. ఆ సంఘటన తలచుకుంటే ఇప్పటికీ అవమానంతో నిండిపోతుంది తన ముఖం. ఇందిర తను అలా అన్నందుకు అనుకుంటోంది.

"కాఫీ చల్లారిపోతుంది తీసుకోండి. మీరు నేను అడిగినదానికి సమాధానం చెప్పనేలేదు" అంది మెల్లగా ఇందిర.

నే నెవరికోసం బ్రతకాలి ?

తన మనసులో కోరిక బయటపెట్టడానికి భయపడుతున్న శేఖర్‌కి ఇందిర ప్రవర్తన, వినయ విధేయతలు వేయి ఏనుగుల బలాన్ని ఇచ్చింది.

"అబ్బే ... నేను ఏమీ అనుకోలేదండి. కాని నేను మీతో కొంచెం...మీతో కొంచెం...మాట్లాడాలి అనుకుంటున్నాను. మీరు ఏమీ అనుకోరు కదా" అన్నాడు.

ఆశ్చర్యంగా చూసింది ఇందిర. ఆ కళ్ళలో ఏదో తెలియని భయం నెమ్మది, నెమ్మదిగా చోటు చేసుకోవడం ప్రారంభించింది.

"మీరు ... దయుంచి ఒక్క నిముషం కూర్చోండి. మిమ్మలినే ... ప్లీజ్."

తప్పనిసరియై కూర్చుందేకాని ఇందిర ముఖంలో భయాందోళన రేఖలు కొట్టవచ్చినట్లుగా కనబడుతున్నాయ్ !

"నేను మీతో ఈరోజు మాట్లాడాలి అనుకున్న మాటలు రెండేళ్ళుగా అనుకుంటున్నాను, అనే చెప్పాలి" అని ఇందిరవైపు చూసాడు.

వేటగాడిని చూసిన లేడిలా తల క్రిందకు దించి ఉన్నప్పటికి ఇందిర కళ్ళు బెదురుతున్నట్లు కనిపించింది శేఖర్‌కి.

ఇందిర ముఖం చూస్తున్న శేఖర్ ఆ నిముషంలో చెప్పదలచుకున్నది ఏమిటో త్వరగా చెప్పాలని నిర్ణయానికి వచ్చాడు

"నేను చెప్పేది మీరు విని నా ఆశ చూసి ఆశ్చర్యపోతారో లేక చిరాకుపడతారో మీ ఇష్టం. మనిషి ఆశాజీవి కదా ! ఆస్తి — అంతస్తు, చదువు — హోదా అన్నీ ఉన్న నేను ఒక అందమైన అమ్మాయికి భర్తగా అయితే అంతకన్నా నాకు జీవితంలో కావలసినది ఏమీ లేదు అనిపిస్తుంది. కాని ఆ అందమైన అమ్మాయి నన్ను... అంటే నాలాంటి అందం లేనివాడిని చేసుకోవడానికి అంగీకరించక పోవచ్చు ! అంగీకరించవచ్చు ! నా అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి మురళీని అడుగడానికి భయం వేసింది. అందుకే నేరుగా మిమ్మలను అడుగాలి అని అనుకుంటున్నాను. ఇన్నాళ్ళకి ఈ అవకాశం దొరికింది.

నన్ను... నన్ను... మీరు వివాహం చేసుకోవడానికి అంగీకరించగలరా ?" అన్నాడు.

భయంగా చూస్తున్న ఇందిర చటుక్కున కూర్చీలోంచి లేచి నిలబడింది.

"ప్లీజ్ !... మీరు ఒక్క నిముషం కూర్చోండి" అన్నాడు అర్థింపుగా శేఖర్.

"మీరు నా తొందరపాటుని అపార్థం చేసుకోకండి. నేను ఎటువంటివాడినో నా గురించి వివరాలు మురళీకి తెలుసు. నాకున్న ఆస్తి — అంతస్తుమీద కోరిక లేదనే చెప్పాలి. నేను జీవితంలో పొందాలి అనుకున్నది ఒక్కటే ! చదువు — సంస్కారంతోపాటు అందమైన మీలాంటి అమ్మాయిని నా భాగస్వామిగా పొందాలి అని ఆరాటపడుతున్నాను. కాని... నేను అలాంటి కోరిక కోరడం హాస్యాస్పదం ఏమో అని ఇప్పుడిప్పుడే అనిపిస్తోంది. దానికి కారణం నా రూపం అనే చెప్పాలి. సారీ !... మిమ్మలను తొందరపడి అడిగినందుకు క్షమించండి. మీరు నా ప్రశ్నకి సమాధానం చెప్పలేరు" అని కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు.


"ఏమండీ !..." అని ఊహించని సంఘటనకి బెదురుతున్న కళ్ళని అదుపులోకి పెట్టాలన్నట్లు తీక్షణంగా శేఖర్ ముఖంలోకి చూసి ... "మీరు నా మౌనాన్ని మరో విధంగా అర్థం చేసుకున్నారు. మీ గురించి మీరే ఏవేవో ఊహించుకుంటున్నారు. అది పొరపాటు. భార్యభర్తలు ఏ అరమరికలు లేకుండా సుఖ సంతోషాలతో జీవితాంతం గడపడానికి ఒక్క అందచందాలే ముఖ్యమంటారా ? ఆ విషయంలో మీరు పొరపడ్డారనే చెప్పాలి. కాని ... మీరు అడిగిన ప్రశ్నకి జవాబు నేను ఒక్కదానిని చెబితే సరిపోదు. అమ్మ, నాన్న, అన్నయ్య వీళ్ళందరూ ఉన్నారు. నేను తొందరపడి ఏ సమాధానం చెప్పలేను. అందుకు క్షమించండి. మీరు చెప్పదలచుకున్నది ఏమిటో అన్నయ్యతో చెప్పండి" అంది.

అనుకోని జవాబు ఇందిర నోటి వెంట రావడంతో శేఖర్ మనసు సంతోషంతో నిండిపోయింది. ఎంత సంస్కారంగా, ఎంత అందంగా జవాబు చెప్పింది. "చాలా థాంక్సండి ! మీ సమాధానం ఇలా ఉంటుంది అని నేను ఊహించనే లేదు. నేను వెళతానండి" అని వెళ్ళిపోయాడు.

* * *

"ఉండరా ! ... మధ్య నీ వేళాకోళం ఏమిటి? అసలు దానిని అడుగనీయ్ ! దాని అభిప్రాయం వినకుండా ఏమిటిరా నీ అల్లరి. అయినా మన ఇందిర లాంటి అందమయిన దానికి ఆ అబ్బాయి జోడు ఏం బాగుంటుందిరా ? ఇందిర అసలు ఒప్పుకోదు! ఏదో మొహమాటానికి మనని అడగమని ఉంటుంది" అంది శాంతమ్మ.

"నువ్వన్నట్లు శేఖర్ పెద్దగా బాగోదుకాని మనిషికి ముఖ్యమైనది ఒక్క అందమే కాదమ్మా. లక్షలకు విలువచేసే ఆస్తి ఉంది. అన్నింటికన్నా విలువైనది, చాలా మంచివాడమ్మా! రెండేళ్ళబట్టి చూస్తున్నాను. ఈ క్వాలిఫికేషన్స్ అన్నీ చూసి ఇందిర శేఖర్‌ని




KERAGEM
కేరాజెమ్ చాలాసార్లు వడకట్టిన అసలైన
కొబ్బరినూనె
100% అసలైనది, చాలాసార్లు వడకట్టిన కొబ్బరినూనె-
విస్తారంగా కొబ్బరి పండే కేరళానుండి
వంటకు వినియోగమయే
రుచికరమైన ఆరోగ్యకరమైన
కొబ్బరినూనె. జాగ్రత్తగా
గమనించండి అది కేరాజెమ్
అసలైన కొబ్బరినూనె.
ఒత్తుగా నిగనిగలాడే
జుట్టుకి అసలైన తలనూనె
జాగ్రత్తగా గమనించండి
అది కేరాజెమ్ అసలైన
కొబ్బరి నూనె.
KERAGEM
E.P.K.102
కేరళా స్టేట్ కోకోనట్
డెవలప్‌మెంట్ కార్పొరేషన్
లిమిటెడ్
(కేరళా ప్రభుత్వపు సంస్థ)
త్రివేంద్రమ్-695 014 (కేరళా)

ఇష్టపడింది ఏమో ! అమ్మా ! నాకు శేఖర్ అంటే ఎందుకో తెలియదు మంచి అభిప్రాయం ఏర్పడింది. మనం ఎంత చూసుకొన్న కొంచెం అందం తక్కువని ఆలోచించాలిగాని...''

''కాని లేదు గీని లేదు... ఇందిరకేం తక్కువ అని చూస్తూ చూస్తూ ఆ అబ్బాయి కెలా ఇందిరను పెళ్ళి చేస్తాం ? ఆస్తి — అంతస్తు, చదువు ఉండచ్చు. ఇందిర బంగారు బొమ్మలా ఉంటుంది. అబ్బాయి నలుపు. వర్ణనాలిటీ బాగానే ఉంటుంది కాని ఏమైనా ఇందిరకు శేఖర్ ఈడు — జోడు ఏం బాగుంటుందిరా ?'' అన్నారు వేంకటేశ్వరరావుగారు.

''మనం లజ్జు గుజ్జు లాడుకోవడం దేనికండి ? అమ్మాయిని అడిగితే పోలా ? ఏ సంబంధం వచ్చినా ముందు అమ్మాయి అభిప్రాయం అడుగుతాం కదండి ? అట్లాగే అబ్బాయి గురించి అడిగితే సరిపోతుంది. ఆ అబ్బాయికి చెప్పడానికి బాగుంటుంది. ఇందిరా !... ఒకసారి ఇలా రా అమ్మా ! మా అందరికి అబ్బాయి చదువుకున్నవాడు — బుద్ధిమంతుడు, ఆస్తి — అంతస్తు ఉన్నవాడు. మంచి సంబంధమే అన్నివిధాల అనిపిస్తుంది. కాని ఏటొచ్చి ఈడు జోడు అంటారే అబ్బాయి...''

* * *

''అమ్మగోరు ! పని అయిపోనాది. ఎల్లిపోతానండి'' అంది పనిమనిషి రంగమ్మ.

మంచంమీద బోర్లా పడుకొని కన్నీటిధారల మధ్య ఆలోచనల గతంలోకి వెళ్ళిన ఇందిర చప్పున మంచంమీదనుండి లేచి రంగమ్మకి ముఖం కనబడకుండా వెనక్కి తిరిగి ''అలాగే మధ్యాహ్నం తొందరగ రా... లక్ష్మిని తలుపు వేయమను'' అంది ఇందిర.

ఇందిర ముఖం చాటుచేసుకోవడం రంగమ్మకి క్రొత్త కాదుగాని అమ్మగోరి ముఖం ఎప్పుడు కళకళలాడేటట్లు భగవంతుడు చూస్తాడో అనుకొంది రంగమ్మ.

రంగమ్మ గుమ్మం దాటగానే ఇందిర మనసులో ఆలోచనలు బయలుదేరాయ్ ! అమ్మ, నాన్న, అన్నయ్యకి శేఖర్ సంబంధం పెద్దగా ఇష్టం లేకపోయినా తను భవిష్యత్‌ను ఊహించుకొంది. శేఖర్‌ని వివాహం చేసుకోవడానికి అంగీకరించడానికి కారణం తనకి ఎదురైన సంఘటనలే ! కాని అన్నీ ఆలోచించి వివాహం చేసుకున్న తనకి మిగిలింది ఏమిటి ? అశాంతి... ఆ వేదన... నిరాశ — నిస్పృహలు. ఎంతో మంచివాడనుకొన్న శేఖర్‌లో అనుమానం. ఏ స్త్రీ భరించలేనిది ! అడుగడుగున అనుమానాలతో వేధించడం. ముందురోజు జరిగిన సంఘటనలో ఎంత వెతికినా అనుమానించ తగ్గది ఏమీ కనిపించడం లేదు. ఎంతో దూరం నుండి శేఖర్ కోసం ఇల్లు వెతుక్కుంటూ వచ్చిన స్నేహితుడికి లక్ష్మిచేత కాఫీ పంపడం తప్పా ? అయినా అంత సాహసం చేయక పోవును. అప్పుడే కాఫీ త్రాగుతోంది. ఇంటికి వచ్చిన వ్యక్తికి కాఫీ ఇవ్వడంలో కూడా వేరే అర్థం తీసుకోవాలా ? ఆ వచ్చిన వ్యక్తి తిరుగుబోతట ... అన్ని లక్షణాలు ఉన్నవాడట. తను వాడి అందచందాలు చూసి ... ఆ వచ్చిన వ్యక్తిని తనవైపు... ఛ ... ఛ ... ఇంటికి వచ్చిన వ్యక్తి మంచివాడైన...

చెడ్డవాడైన ... ఆ వ్యక్తి గుణాలతో సంబంధం ఏమిటి ఆ ఇల్లాలుకి ?

''ఇందిరా ! ... '' సింహగర్జన లాంటి పిలుపుకి ఉలిక్కిపడి చూసింది ఇందిర.

ఆనాడు ఇందిర అని పిలిచిన పిలుపులోని మాధుర్యానికి, ఈనాటి పిలుపుకి ఎంత తేడా ?

''భర్త వచ్చినా ఏమిటో అంత పరధ్యానం ? ప్రొద్దున్న వచ్చిన కిషోర్‌గాడి అందాన్ని గుర్తు చేసుకుంటూ కలల లోకంలో ఉన్నవా ?''

''ఏమండి ! ఏమిటా మాటలు. ప్చ్ ! కలల లోకం నాకెలా వస్తుందండి ? జరిగిన సంఘటనలో మీరు అనుమానించ తగ్గట్లు నేను ప్రవర్తించలేదే అని విచారిస్తున్నాను. ఎవరో అంగమైతే ... ఎవరో ఎలాంటి వాడైతే నాకెందుకండి ? చీటికి మాటికి మిమ్మలను మీరే రూపంలో తక్కువ అని గుర్తు చేసుకుంటున్నారు కాని నేను ఊహకైనా మీ అందచందాలు తక్కువ అనుకోవడం లేదండి !''

''నోరుముయ్ ! అధిక ప్రసంగం ! నాలో లోటుపాట్లు ఎత్తి చూపుతున్నావా ? ఎవడో ముక్కు ముఖం తెలియనివాడు వస్తే కాఫీ

ఇవ్వవలసిన అవసరం ఏముంది ? వాడి అందం నిన్ను ఆకట్టుకోపోతే.''

''ప్లీజ్ ! దయుంచి మీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడకండి. నన్ను ఇలా ఏడిపిస్తు ఉండే కన్నా ఒక్కసారి చంపేయండి'' అంది కళ్ళనీరు పమిటతో తుడుచుకుంటూ.

* * *

సాయంకాలం ఐదవుతుండగా ఇంటిముందాగిన కారుని చూసి ఆశ్చర్యపోయింది ఇందిర. ఎప్పుడు ఆరు దాటితేకాని రాని శేఖర్‌ని చూసి పెదవులపై నిర్లిప్తమైన నవ్వు బయలుదేరింది. ఇలా రావడం క్రొత్తకాదు. పెళ్ళయిన క్రొత్తలో తొందరగా ఇంటికి వచ్చిన శేఖర్‌ని చూసి పొంగిపోయేది. కాని తనతో సంబంధం లేకుండా ఇంటిలోపల గదులన్ని దేనికోసమో వెతికినట్లు కనబడే భర్తను చూస్తే... కొంచెం... కొంచెం అర్థమవసాగింది. ఎంత అవివేకి తన భర్త. కొందరి మగవాళ్ళలో కాస్త అనుమాన రేఖలు ఉంటాయి అనుకొంది క్రొత్తలో, కాని ఇంత అవివేకమా ?

''ఇందిరా ! ఎంతో సరదాగా ఇంటికి వచ్చాను. కాని నువ్విలా ఏదో పోగొట్టుకున్నదానిలా ఉంటావేం? నా సరదాల్ని, హుషారుని నీ ప్రవర్తనతో సమాధి చేసావ్ ?''

ఒక్క నిముషం ఇందిర కనుబొమలు ఆశ్చర్యంతో ముడిపడ్డాయ్ ! సూటిగా కళ్ళు ఎత్తి శేఖర్ వైపు చూసింది.

''టైమ్ అవుతుంది. పిక్చర్‌కి వెళదాం అని వచ్చాను, వస్తావా ? రావా ? చెప్పు ?''

''ఎంత చక్కగా పిలిచారు. భర్త భార్యను ఇలానే పిలుస్తాడు కాబోలు... తన బ్రతుక్కి సినిమా ఒకటి తక్కువైంది.''

''ఏం వస్తావా ? రావా ? ఏమిటా ఆలోచనలు. నాతో రావడం ఇష్టం లేకపోతే మానేయ్ ?''

''అహా... అలా అంటారు ఏమిటండి ? మీతో రావాలని ఉండకపోతే... మరెవరితో ఉంటుందండి ? ఒక్క నిముషంలో తయారై వస్తాను ఉండండి'' అని అక్కడనుండి వెళ్ళిపోయింది ఇందిర.

''ఇందిరా !...'' అని చప్పున తన హృదయం మీదకు లాక్కొని కౌగిట్లో బంధించి ''నువ్వు తయారు కానక్కరలేదు ఇందు, ఇలా ఎంత అందంగా ఉన్నావో తెలుసా ? పద టైమ్ అవుతుంది'' అన్నాడు శేఖర్.

ఎడారిలో పయనిస్తున్నవాడు నాలిక పిడచ కట్టుకుపోయి నీటిచుక్క కోసం పరితపిస్తున్న వాడిలా, ఆవేదనతో రగులుతున్న ఇందిర హృదయంపై పన్నీటిజల్లులా అనిపించాయి శేఖర్ మాటలు.

సినిమా చూసి కారు ఎక్కుతున్న ఇందిర మనసులో ఆనందం పరవళ్ళు త్రొక్కుతోంది. ఇలాంటి జీవితం కోరుకుంది.

''ఏమండోయ్ !'' అని హడావిడిగా ఇందిర దగ్గరకు ఒక వ్యక్తి పరిగెట్టుకు వచ్చాడు.

ఇందిర కంగారుగా చూసింది.

''ఆ...నేను పోల్చుకున్నది నిజమే ! మీరు ఇందిర కదండి. అలా చూస్తున్నారు ఏమిటి ? నేను శ్రీను నండి ! శ్రీను అంటే గుర్తు లేనట్లుంది. బాబిని...అరె ఇంకా గుర్తులేనట్లుంది. శెలవులకి మీ తాతగారి ఊరు వచ్చేవారు. మీ తాతగారి ఎదురిల్లే మాది. ప్రొద్దున్నే లేచి నిద్ర ముఖంతోనే మా ఇంటికివచ్చి నన్ను ఆడుకోవడానికి రమ్మనేవారు. మనతో రాము, నిర్మల, శారద ఆడుకొనేవాళ్ళు. మిమ్మలను ఆఖరిసారిగా ఎస్.ఎస్.ఎల్.సి. ప్యాసు అయినప్పుడు చూసాను. చాలా మారిపోయారు. అందుకే గుర్తుపట్టలేక చూసి ... చూసి వచ్చాను.''

కొద్ది క్షణాలు వరకు ఏం మాట్లాడలేక పోయింది.

''అవునండి ! పోల్చుకోలేకపోయాను ! బాగున్నారా ? ఏం చేస్తున్నారు ?'' అంది ఏదో ఒకటి మాట్లాడాలి అన్నట్లు.


''ఆ ... బాగానే ఉన్నానండి. ఈ మధ్యనే ఈ ఊరువచ్చాను. ఏదో చిన్న ఉద్యోగం చేస్తున్నాను. ఇన్నాళ్ళకు కలుసుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది.''

''... ... ...''

[38 వ పేజీ చూడండి]



PIES FOR SALE
వారెవ్వా! వహ్వా!
ఇదేమరి గోల్డ్‌స్పాటింగ్ రోజు!
CAUTION PIE FIGHT IN PROGRESS
ఇదొక క్రొత్త మాట కాదు సుమండీ!
ఉత్సాహంతో పొంగులు వారే ఆనందాలచిందులకీ,
మజాగా హుషారైన భావాలకు
ఇదొక అనుభవం మరి. ఆనందం, మజా,
తమాషాలు మూడూ కల్సిన ముచ్చటైన
ముదిపపు మాటే...గోల్డ్‌స్పాటింగ్.
Gold Spot
గోల్డ్‌స్పాటింగ్‌తో వహ్వా...మజా యే మజా!
TRIKAYA GS 3 80 TEL



'సత్యం – శివం'లో అక్కినేని, రతి

ఊరికిచ్చిన మాటలో ఊరికొక్క వైద్యుడు

నాటువైద్యుడు ధైవాధీనం (మాడా) వీధి అరుగుమీద కూర్చొని, ఒక రోగి చేతి నాడిని పరీక్షిస్తున్నాడు. ఎదురుగా షుమారు ఇరవైమంది రోగులు ఉన్నారు.

"రెండు రోజుల నుండి ఒకటే జ్వరమండి," అన్నాడు ఒక రోగి.

"నీ సొరచెట్టు బాగా కాస్తోందా? మరి, సొరకాయలు పంపలేదేం?" అడిగాడు ధైవాధీనం.

"నిన్నటినుండి కడుపులో ఒకటే నొప్పండి," అన్నాడు ఇంకో రోగి.

"నీ గేదె ఈనిందా? మరేదీ? జున్నుపాలు పంపలేదేం?" ధైవాధీనం ప్రశ్న.

"రెండు రోజుల నుండి విరేచనం కావడం లేదండి," అన్నాడు మరో రోగి.

"నీ కోడి గుడ్లు పెడుతోందా? అదీ సంగతి. పెట్టిన గుడ్లన్నీ వాకు పంపకుండా నువ్వొక్కడివే తింటే విరోచనం ఎలా అవుతుంది?" అని ధైవాధీనం అంటూండగా ఎంకి (శ్రీవిజయ) వొయ్యారంగా నడుచుకుంటూ వచ్చింది. "రాత్రంతా వొళ్ళు వొక యిదంగా వుందండి," అంది.

ధైవాధీనం మెలికలు తిరిగిపోతూ, మిగతా రోగుల్ని మరచిపోయి, "అయితే, ఇలా రా!" అంటూ ఎంకి చెయ్యి పట్టుకొని బయలుదేరబోయాడు. దాంతో మిగితా రోగులకు కోపం ఆగింది కాదు. ఒకడు తెగించి, "పొద్దున్ననంగా వచ్చాను. పైగా జున్నుపాలు తెచ్చాను. నన్ను వదిలేసిపోతున్నారా?" అంటూ విసుక్కున్నాడు.


ధైవాధీనంకు చిర్రెత్తింది. "ఏవయ్యా! ఊరు మొత్తానికి ఒక్కగానొక్క వైద్యుడ్ని. అందరూ రోగాలు ఒక్కసారి తెచ్చుకుని నా ఇంటిమీద పడితే – నేనేం చేయను? ఆగితే ఆగు! లేకపోతే పో!" అంటూ ఎంకిని లాక్కెళ్లిపోయాడు.

రోగులంతా బాధతో ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

ఎం. బాలయ్య కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తూ సమర్పించే అమృతా ఫిలిమ్స్ "ఊరికిచ్చిన మాట" చిత్రానికి అలవర్తి సూర్యనారాయణ, మన్నవ వెంకట్రావు నిర్మాతలు.

అంతం కాదిది ఆరంభం

"మే 22 నుంచి నెలాఖరు వరకు జరిగే రెండో షెడ్యూల్‌తో పూర్తవుతుంది," అన్నారు విజయనిర్మల. ఈమె స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఎస్. రమానంద్, ఎస్. రఘునాథ్ నిర్మించే విజయకృష్ణ మూవీస్ "అంతం కాదిది ఆరంభం" తొలి షెడ్యూల్ ఏప్రిల్ 29 నుంచి మే5 వరకు జరిగింది. హీరో కృష్ణ సమర్పణలో ఆయనతో పాటు విజయనిర్మల, సత్యనారాయణ, జగ్గయ్య, అల్లురామలింగయ్య, త్యాగరాజు, రవికాంత్, గీత, కృష్ణకుమారి, వెన్నిరాడై నిర్మల పాత్రధారులు. మోదుకూరి జాన్సన్, రమేష్‌నాయుడు, వేటూరి, లక్ష్మణ్ గోరే, పుష్పాలగోపీకృష్ణ, తోట తరణి, ఆదుర్తి హరనాథ్‌లతో ఎస్. రవికుమార్ నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు.


స్త్రీని గౌరవించని జాతిని దేవతలు దీవించరు.
ధర్మం దయ చూపదు.
శ్రీ క్రాంతి చిత్ర
న్యాయం కావాలి
నిర్మాత క్రాంతికుమార్
దర్శకత్వం: ఎ.కోదండరామిరెడ్డి
THARAKAPRABHU ADS
సాయికృష్ణ
ఎస్.ఎస్.ఎ.పి
వి.యం.సి



'అద్దాల మేడ'లో అంబిక

సప్తపదిలో అయినవాళ్ళ ఆవేదన

హేమ (సబిత) పడవ చెక్కమీద మువ్వల పాదాలు ఉంచి, జాగ్రత్తగా దిగింది. ఆమె వెనుక పార్వతీశం (శేషు), బృందం దిగడం చూసి, "బావగారూ!" అంటూ ఎదురు వచ్చాడు అవధాని (రమణమూర్తి).

"బావగారూ, మీరా! కులాసాయేనా? హేమా! మీ మావయ్యమ్మా. అవధాని మావయ్య," అంటూ పరస్పరం పరిచయం చేశాడు పార్వతీశం.

హేమ వినయంగా నమస్కరించేసరికి మురిసిపోతూ, "ఎంత పెద్దదానివైపోయావమ్మా ఎంత ఒద్దిక, పొందిక నేర్చుకున్నావు!" అన్నాడు అవధాని.

"మావఁగారు కులాసాగా ఉన్నారా?" అడిగాడు పార్వతీశం.

"ఆఁ ... కులాసానే, బావగారూ! ఇంకా అలాగే ఉన్నారు. మనిషిలో ఏం మార్పులేదు. ఆ పట్టూ, బెట్టూ రవ్వంతైనా తగ్గలేదు," అన్నాడు అవధాని.

"పోన్లెండి. పెద్దవారు — పాపం!" అవధాని బాధ అర్థం చేసుకుంటూ అన్నాడు పార్వతీశం.

ఇంతలో దొరవారి నౌకరొకడు వచ్చి పార్వతీశానికి నమస్కరించి, "దండలయ్యా ... తమర్ని దొరవారు దేవుడికాడికి తీసుకురమ్మన్నా రండయ్యా! తమ బస ఆడేనంట," అన్నాడు.

అవధాని మనసు చివుక్కుమంది. "చూశారా, బావగారూ! అయినవాళ్ళం ఇందరం ఉండీ — మిమ్మల్ని పరాయివాళ్ళలా దేవుడికి చేరుస్తున్నాం," అన్నాడు.

"హుఁ ... మీ దంపతులకు మేమంటే ఉన్న అభిమానం, ఆపేక్ష—నాకు తెలియనివా, బావగారూ! బాధ పడకండి. పదండి," అన్నాడు పార్వతీశం.

అవధానితో కూడా అంతా కదిలారు.


కె. విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో భీమవరపు బుచ్చిరెడ్డి నిర్మించిన జ్యోతి ఆర్ట్ క్రియేషన్స్ "సప్తపది" చిత్రంలో జె. వి. సోమయాజులు, రవికాంత్, గిరిష్, అల్లు రామలింగయ్య, సాక్షి రంగారావు, ధూళ్ళి, జానకి, ఫణి, ప్రమీలారాణి తెరముందు — జంధ్యాల, కె. వి. మహాదేవన్, కస్తూరి, తోట, జి. జి. కృష్ణారావు, నందూరి విజయ్, బి. అంజిరెడ్డి తెరవెనుక కృషి చేశారు.

కట్నాలు — కన్నీరు


"సమాజంలో చైతన్యం తీసుకురావాలన్న తలంపుతో చిత్ర నిర్మాణం చేపట్టాను. మే నెలలో పాటలు రికార్డు చేసి, జూన్ నుంచి చీరాల దగ్గరున్న కుంకలమర్రు గ్రామంలో ఒకే షెడ్యూల్‌లో పూర్తి చేస్తాను," అన్నారు ధూళిపాళ లక్ష్మీనారాయణ. ఈయన నిర్మించే రజని ఆర్ట్ మూవీస్ "కట్నాలు—కన్నీరు" చిత్రంలో రంగనాథ్, నరసింహరాజు, రమాప్రభ, కొత్త బాలనటుడు రవికుమార్ ఇంత వరకు నిర్ణయింపబడ్డారు. సి.హెచ్. వసంతాచార్య సంభాషణలు, హెచ్. అప్పారావు ఛాయతో కథ, స్క్రీన్‌ప్లే, కూర్పు, దర్శకత్వ బాధ్యతలను జి.ఎస్. కృష్ణమూర్తి నిర్వహిస్తారు.



'గడసరి అత్త — సొగసరి కోడలు'లో వరలక్ష్మి, శ్రీదేవి



'సప్తపది'లో సోమయాజులు, రమణమూర్తి, రవికాంత్




'సంసారం — సంతానం'లో సీమ, జయసుధ

ఆదర్శ ఫిలిమ్ కంబైన్స్ తొలి చిత్రం

"టార్జాన్ తరహా చిత్రం. మొదటి షెడ్యూల్ నెల్లూరుజిల్లా పెంచలకోనలో పక్షం రోజులపాటు జరిగింది. తడ అడవులలో ఏప్రిల్ 19 నుంచి రెండో షెడ్యూల్ జరుగుతోంది. వన్య మృగాలన్నీ ఈ చిత్రంలో ఉంటాయి," అన్నారు కె. గురుదేవ్. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో బి. పాండు నిర్మించే ఈ చిత్రంలో బొంబాయి నటుడు ఏస్‌రాజ్ అడవి వీరుడుగా నటిస్తున్నాడు. విజయలలిత, ప్రియంవదన, జయమాలిని, త్యాగరాజు, గిరిబాబు, ఎస్.వి. రామదాసు, బేతా రామచంద్రరావు, చిడతల అప్పారావు, రమా[illegible], టౌ[illegible] [illegible] పాల్గొంటున్నారు. మే నెలాఖరుకు [illegible]రీకరణ పూర్తవుతుంది. విజయరత్నం మాటలు, ఎస్. హనుమంతరావు సంగీతం, సాయిప్రసాద్ ఛాయ, రంగారావు శిల్పం, కందస్వామి కూర్పు, పి. భాస్కర్ సహకార దర్శకత్వంలో బి. వెంకటరావు కథ సమకూర్చి నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు.

[illegible] లో ఒక దృశ్యం



సినిమా

మహాభారతంలో మరో ద్రౌపది

"మే 10 నుంచి జూన్ 10 వరకు హైద్రాబాద్‌లో అన్నపూర్ణ, శ్రీ సారథి స్టూడియోలలో ఒకే షెడ్యూల్‌లో పూర్తి చేస్తాం," అన్నారు వి. హనుమాన్‌ప్రసాద్. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో కె. కోటేశ్వరరావు, బెనర్జీ నిర్మించే కృషి చిత్రాలయావారి పై చిత్రంలో రంగనాథ్, నారాయణరావు, హరిబాబు, నరసింహరాజు, సి.ఎల్. నారాయణ, జయభాస్కర్, హేమసుందర్, జ్యోతి, అనిత, సరోజ, పుష్పకుమారి, ప్రతాప్‌పోతన్ పాత్రధారులు. ఉదయరాజ్ ఛాయాగ్రాహకుడు. ప్రేమ్‌కుమార్, మల్లీశ్వర్ సహ దర్శకులు. ఇంకా కృష్ణమూర్తి, సాయికుమార్, వి. ధర్మారావు, జయప్రసాద్ తెరవెనుక కృషి చేస్తున్నారు." ఈ చిత్ర కథకుడు, సంభాషణలకర్తగా ఆకెళ్ళ అనే యువ రచయిత పరిచయం గావింపబడుతున్నాడు.

పిడికెడు ఆకాశం

"దసవత్తరమైన ప్రణయగాథ... మద్రాసు ఫిలిమ్ ఇన్‌స్టిట్యూట్‌లో నటనలో పట్టభద్రులైన వారెంతో ప్రతిభావంతంగా నటించారు. కృష్ణా, మూసీ నదుల సంగమం అయిన నల్గొండ – గుంటూరుజిల్లాల మధ్య జనవరి, ఫిబ్రవరి మాసాల్లో షూటింగ్ పూర్తి చేశాం," అన్నారు ఎస్. డి. లాల్. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వాలలో కుమారి సాబరా నిర్మించిన జె. జె. ఆర్ట్స "పిడికెడు ఆకాశం" చిత్రానికి ఎస్. ఝాన్సీరాణి సంభాషణలు రాశారు. ఛాయాగ్రహణం నెఱపిన వి. ప్రభాకర్ కూడా ఫిలిమ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన వ్యక్తే. సి. నారాయణరెడ్డి, జాలాది, వడ్డేపల్లి కృష్ణ గీతాలకు ప్రముఖ వయొలినిస్ట్ వైది మధురమైన బాణీలు కూర్చారు. గోవిందస్వామి సంకలనకర్త. గుమ్మడి కుటుంబరావు సహదర్శకుడు. "రీ రికార్డింగ్ పూర్తయింది. ఇక విడుదల చేయడమే తరువాయి," అని ఈ చిత్రాన్ని సమర్పించే సయ్యద్ మీర్ తెలిపారు.

'మరియా మై డార్లింగ్'లో





ఇటీవల పోలీసు సంక్షేమ నిధికోసం విశాఖలో జరిగిన 'దాసరి నైట్'లో పాల్గొన్న ప్రముఖ తారలు —

పోలీసు సంక్షేమ నిధి సహాయార్థం విశాఖలో 'దాసరి నైట్'

లోగడ ప్రజాహిత కార్యక్రమాలకు సినిమా రంగంలోని ప్రముఖులు పలుసార్లు పూనుకొని, దిగ్విజయంగా నెరవేర్చి ప్రశంసలందుకున్న విషయం సర్వ విదితమే. ఐతే, ఏప్రిల్ 26న విశాఖపట్టణంలో పోలీసు సంక్షేమ నిధి సహాయార్థం ఏర్పాటు చేయబడిన ''దాసరి నైట్''లో ఎన్నో ప్రత్యేకతలున్నాయి.

చలన చిత్ర చరిత్రలో ఒక విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్న బహుముఖ ప్రజ్ఞావంతుడు దాసరి నారాయణరావు ఇలాంటి ప్రజాహిత కార్యక్రమానికి పూనుకున్నప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో 95 శాతం ఆయన వెంట తరలి వెళ్ళడంలో అతిశయమేమీలేదు. అగ్రనటులతోపాటు ఎందరో కళాకారులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు ఛార్టర్డ్ ప్లేన్‌లో, ట్రెయిన్‌లలో, కారులలో విశాఖకు అమితోత్సాహంతో చేరుకున్నారు.

కమల్, జయమాలిని



అనుక్షణం విశాఖ పురజనుల హర్షధ్వానాలు అందుకున్న ఆ కార్యక్రమాలు ధూళిపాళ 'మయసభ' ఏకపాత్రాభినయంతో ప్రారంభమైంది. ''ఆ కోటు నాది'' నాటికలో రంగనాథ్, సత్యనారాయణ, నిర్మాతలు రామానాయుడు, ఎం. ఎస్. రెడ్డి, పుండరీకాక్షయ్య, బలరామ్ పాల్గొన్నారు. ప్రభ జానపద నృత్యం; చంద్రమోహన్, ప్రభాకరరెడ్డి, రాజసులోచన పాల్గొన్న ఆదివిష్ణు నాటిక; రాజసులోచన, హేమా చౌదరి, విజయలలిత, సుభాషిణి పాల్గొన్న ''రామాయణం'' నృత్య రూపకం; రంగనాథ్, మురళీమోహన్, రమాప్రభ, కబీర్‌దాస్ పాల్గొన్న కాశీ విశ్వనాథ్ విరచిత ''ఓటున్నవారికి కోటి దండాలు'' నాటిక; సూర్యకాంతం, నిర్మల, గుమ్మడి పాల్గొన్న ''గయ్యాళి — గంపగయ్యాళి'' నాటిక; మురళీమోహన్, గిరిబాబు పాల్గొన్న 'మాలిష్‌వాలా' స్కిట్; చలం, నాగేష్ పాల్గొన్న మరో స్కిట్, రాజ్‌బాబు 'అ ఆ...ల పాట', అల్లురామలింగయ్య 'నారాయణమ్మ' పాట ప్రేక్షకులను రంజింప చేశాయి. అన్నిటికన్నా హైలైట్ దాసరి రచించి, నాయకుడుగా నటించిన ''మూడిళ్ళ పూజారి'' నాటిక. అప్పటికప్పుడు స్టేజ్ వెనుక రిహార్సల్స్ జరిపి ప్రదర్శింపబడిన ఈ నాటికలో జయసుధ, జయప్రద, శ్రీదేవి, గీత, అంబిక ఎక్కడా తడబడకుండా సునాయాసంగా నటించడం ప్రశంసనీయమైన విషయం. ఇక దాసరి నటన, డైలాగ్ డెలివరీలోని 'ఈజ్' గురించి పేర్కొనడం పంచదార తియ్యగా ఉంటుందని చెప్పినట్లే అవుతుంది. జగ్గయ్య, జానకి తొలుత సభను ప్రారంభిస్తే, కార్యక్రమాలకు రావు గోపాలరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కళాకారులు చేసిన సహాయానికి పోలీస్ డైరెక్టర్ జెనరల్ శ్రీ ఎం. వి. నారాయణరావు కృతజ్ఞతలర్పిస్తే, ''ఇంతమంది నామీద అభిమానంతో, నా మాటమీద గౌరవంతో వచ్చి ఈ కార్యక్రమాలను జయప్రదం చేయడం నేను నోచుకున్న భాగ్యానికి నిదర్శనం,'' అంటూ దాసరి కృతజ్ఞతాభివందనాలు అర్పించారు.



'పూరికిచ్చిన మాట'లో మాధవి, కాంతారావు

శ్రీకర్ ప్రొడక్షన్స్

''జూన్ 15 నుంచి జూలై 15 వరకు ఒకే షెడ్యూల్లో పూర్తవుతుంది,'' అన్నారు అట్లూరి పూర్ణచంద్రరావు. ఈయన ''చట్టం ఒరు ఇరుట్టెరై'' అనే తమిళ చిత్రం ఆధారంగా సమర్పించే చిత్రంలో లక్ష్మి తమ్ముడుగా చిరంజీవి నటిస్తారు. గోపి సంభాషణలకర్త. చక్రవర్తి సహాయకులు చక్ర — కృష్ణ తొలిసారిగా ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహిస్తారు. ''విజయదశమికి విడుదలవుతుంది,'' అన్నారు నిర్మాత వంకినేని సత్యనారాయణ. తమిళ చిత్రానికి దర్శకత్వం నెరపిన చంద్రశేఖర్‌నే తెలుగు చిత్రానికి కూడా దర్శకుడుగా నియమించారు.

ఈశ్వరీ క్రియేషన్స్

నటరత్న యన్.టి.రామారావు సమర్పించు

సత్యం శివం

దర్శకత్వం: కె.రాఘవేంద్రరావు * నిర్మాత: డి.వెంకటేశ్వరరావు



సీతాలులో కొత్త పనిమనిషి

గుమ్మం దగ్గరే నిలబడ్డ సీతాలు(జయసుధ)తో ఆ ఇంటి యజమాని వెంకట్రామయ్య (రావి కొండలరావు) "రా లోపలికి," అన్నాడు. పక్కనే ఉన్న సుబ్బయ్య (కబీర్‌దాస్) "ఆగు! కుడి కాలు ముందు పెట్టాలి," అన్నాడు. వెంకట్రామయ్య వినుక్కుంటూ, "ఇదేవన్నా కొత్త పెళ్ళికూతురా? పనిమనిషిరా! ఏదో కాలుపెట్టిరానీ," అంటూండగా ఆయన భార్య శాంతమ్మ (నిర్మల) వచ్చింది. "ఇది మా ఆవిడ. నచ్చిందా?" అని సీతాలును అడిగాడాయన.

సీతాలుకు నవ్వొచ్చింది. "మీ ఆవిడ మీకు నచ్చాలిగాని, నా కెందుకు?" అంది.

వెంకట్రామయ్య వెంటనే "పోనీ – సీతాలు నీకు నచ్చిందా?" అని భార్యను అడిగితే, "పనిపిల్ల నచ్చడమేమిటండీ–చేసేపని నచ్చాలిగాని," అందామె.

"ఏమేం పనులు చెయ్యాలో చెప్పండమ్మా. పని నచ్చేటట్లు నేను చేస్తాను," అంది సీతాలు.

వెంకట్రామయ్య "ఆగు! నే చెప్తాను. ఇంటి పనీ, వంటపనీ – అన్ని పనులూ చెయ్యాలి. మా దొడ్లో పశువులున్నాయి. వాటివి కూడా నువ్వే చూసుకోవాలి," అన్నాడు.

సుబ్బయ్య వంతపాటగా "అయ్యగారిని కూడా నువ్వే చూసుకోవాలి," అన్నాడు.

"వాటికి గడ్డి, పొట్టు నువ్వే పెట్టాలి," అని వెంకట్రామయ్య అంటే, "అయ్యగారికి అన్నం కూడా నువ్వే పెట్టాలి," అని అందుకున్నాడు సుబ్బయ్య. వెంకట్రామయ్య తన ధోరణిలో "వాటికి పొద్దుటే నీళ్ళు పెట్టాలి," అన్నాడో – లేదో "అయ్యగారికి కూడా వేన్నీళ్ళు నువ్వే పెట్టాలి," అన్నాడు సుబ్బయ్య.

వెంకట్రామయ్యకు కోపం ముంచుకొచ్చింది. "ఒరేయ్! నేను పశువుల గురించి చెపుతూంటే, పక్కనే నువ్వు నా గురించి చెప్పడంలో నీ ఉద్దేశం?" అన్నాడు.

"మీరేం చెప్పక్కర్లేదు. చెప్పాల్సిందేదో నే చెప్తాను," అంటూ శాంతమ్మ, సీతాలును లోపలికి తీసుకెళ్ళింది.

దాసరి కథ, స్క్రీన్‌ప్లే, దుగ్గా నాగేశ్వరరావు దర్శకత్వంలో మణియన్, విద్వాన్ లక్ష్మణన్ నిర్మించిన మణియన్ ఫిలిమ్స్ "సీతాలు"లో మురళీమోహన్, మోహన్‌బాబు, కాంతారావు, గిరిబాబు, సుమలత ఇతర పాత్రధారులు. రాజశ్రీ, ఎం. ఎస్. విశ్వనాథం, కె.ఎస్. హరి, భాస్కరరాజు, బాబు, డి. దశరథరామిరెడ్డి, పి. సూరిబాబు, జె. వెంకటేశ్వరరావు ప్రభృతి సాంకేతికవర్గం.

ఉషశ్రీ చిత్రం

శోభన్‌బాబు, జయసుధ, సత్యనారాయణ ప్రభృతులతో పి. చిన్నపరెడ్డి సమర్పించే చిత్రం షూటింగ్ ఆగస్ట్‌లో ప్రారంభమై, అక్టోబర్‌కు పూర్తవుతుంది. ఉషశ్రీ కథ, స్క్రీన్‌ప్లేతో పి. జె. ప్రభాకరరెడ్డి నిర్మాత.

జంతులోకం చిత్రానికి దాసరి గీతాలు

"రోజుకు ఇరవై రెండు గంటలు పనిచేస్తూ, చిత్ర పరిశ్రమలోని అన్ని వర్గాలవారికి కొండంత అండగా ఉన్న దాసరి నారాయణరావుగారు మా చిత్రానికి రెండు చక్కని పాటలు రాసిచ్చారు. ఒక పాటను బాలు, మరొక పాటను సుశీల పాడారు," అన్నారు వాశిరాజా ప్రకాశం. ఈయన మమత చిత్ర పతాకంలో నిర్మించే "జంతులోకం" చిత్రం గురించి వివరిస్తూ, "జంతువులది చిత్రమైన ప్రవృత్తి. వాటికీ మనస్సు ఉంది. వాటికీ మమకారం ఉంది. లేనిదల్లా నోరు మాత్రమే. అలాంటి రెండు వందల జీవులతో రెండు గంటల వినోద కాలక్షేపం మా చిత్రం. వివిధ దేశాల అడవుల్లో సంచరించే రకరకాల వింత జంతువుల దినచర్యలు, వాటి అలవాట్లు, వాటి బ్రతుకుతెరవులు ఈ చిత్రంలో ముఖ్యాంశం. దాదాపు రెండేళ్ళపాటు సుప్రసిద్ధ దర్శకుడు, ఛాయాగ్రాహకుడు హెంజ్ సీమన్ తన భుజానికి మూవీ కెమెరాను తగిలించుకుని, కాకులు దూరని కారడవుల్లో సంచరించి ఈ చిత్రాన్ని రూపొందించారు. వేటూరి వ్యాఖ్యానం రాశారు," అని తెలియజేశారు.



'న్యాయం కావాలి'లో రాధిక

నేపాల్ గూఢచారి 999

"పూర్తిగా నేపాల్‌లో తయారయింది చిత్రం. కన్నడ హీరో రాజ్‌కుమార్, పద్మప్రియ, రాజీ, చంద్రలేఖ, పెమ్మసాని రామకృష్ణ, మమత, సిలోన్ మనోహర్, భీమరాజు నటించారు," అన్నారు జి.ఎస్.వి. రావు. ఈయన నిర్మించే విజేతా ఆర్ట్స్ "నేపాల్ గూఢచారి 999" చిత్రాన్ని దొరై – భగవాన్ దర్శకత్వంలో దేసు వెంకటసుబ్బారావు సమర్పిస్తున్నారు. రాజశ్రీ సంభాషణలకర్త. సత్యం – జి.కె. వెంకటేశ్ సంగీత దర్శకులు. పి. ఎస్. ప్రకాశ్ ఛాయాగ్రాహకుడు. బాలు సంకలనకర్త. ★



రిలయన్స్

రెండు లక్షల మందికి పైగా రిలయన్స్‌లో పెట్టుబడి పెట్టి లాభాలు గడించారు

డిబెంచర్
సిరీస్-1
అక్టోబర్ 1979 లో
జారీ చేయబడిన
ప్రతి రూ. 500 డిబెంచర్,
నేటికి, అంటే
19 నెలల్లోగానే రూ. 487
(97 శాతం)
ఆదాయాన్నిచ్చింది.

డిబెంచర్
సిరీస్-2
నవంబర్ 1980 లో
జారీ చేయబడిన ప్రతి
రూ. 125 డిబెంచర్
ఇప్పటికే, అంటే
6 నెలల్లోనే,
ధర పెరిగి రూ 160 కి
చేరింది.

నేడు గతాన్ని మించిన అవకాశం :

రిలయన్స్ టెక్స్‌టైల్స్‌లో పెట్టుబడికి మరో చక్కని అవకాశం – సంపూర్ణ సురక్షితమైన కన్వర్టిబుల్ డిబెంచర్స్

79.50 కోట్ల రూపాయల వ్యయంతో, అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన అమెరికన్ కంపెనీ డ్యూపాంట్ వారి సాంకేతిక సహకారంతో నెలకొల్పబడుతున్న రిలయన్స్ పాలియెస్టర్ ఫిలమెంట్ యార్న్ ప్రాజెక్టులోని కొంత వ్యయంకోసం, అతి త్వరలో రిలయన్స్ టెక్స్‌టైల్స్‌వారు 24 కోట్లరూపాయల విలువగల డిబెంచర్స్‌ను (ఒక్కొదాని వెల రూ. 125) విడుదల చేయబోతున్నారు.